ప్రజాశక్తి శ్రీకాకుళం

గురువారం
జనవరి - 4
2018

12 పేజీలు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వంట కార్మికులు

ప్రయివేటుకు వద్దు

- మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వమే నిర్వహించాలి
- కలెక్టరేట్ వద్ద వంట కార్మికుల ధర్నా
- వైసిపి మద్దతు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటు ఏజెన్సీకి అప్పగించకుండా, ప్రభుత్వమే నిర్వహించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.నాగమణి, ఎ.మహాలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు సమస్యలపై ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యాన వంట కార్మికులు కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్‌లో ఏటా నిధుల కేటాయింపును తగ్గిస్తూ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. జిల్లాలో ఈ పథకంలో పనిచేస్తున్న ఏడు వేల మంది మహిళలు 15 ఏళ్లుగా వ్యయప్రయాసలను ఎదుర్కొంటూ ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు వంటలు చేస్తున్నారని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా, వాటన్నింటినీ అధిగమించి ఈ పథకాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వంట కార్మికులు విద్యార్థులకు భోజన వసతి కల్పించేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం లేదని విమర్శించారు. కార్మికుల కనీస వేతనం రూ.ఐదు వేలు ఇవ్వాలన్నారు. పెండింగ్ బిల్లులు, వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. మధ్యాహ్న వంటకు సబ్సిడీపై వంటగ్యాస్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని (మిగతా...4లో)

అభివృద్ధి జపం... కదలని ప్రగతిరథం

- మాటల్లోనే సస్యశ్యామలం
- అసంపూర్తిగా సాగునీటి ప్రాజెక్టులు
- ఉద్దానం సాయం అధ్వానం
- ఆమదాలవలస 'షుగర్స్' కోసం రైతుల ఎదురుచూపులు
- నేడు జిల్లాకు సిఎం చంద్రబాబునాయుడు రాక


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనకు వచ్చిన ప్రతిసారీ వరాల జల్లు కురిపిస్తున్నారు. జిల్లాకు సిఎం రావడం ఇది పదకొండోసారి. గతేడాది జనవరి ఆరో తేదీన రాజాంలో నిర్వహించిన నాలుగో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. సెప్టెంబర్ 11న వీరఘట్టంలో నిర్వహించిన ఇంటింటికీ టిడిపి కార్యక్రమాన్ని ఇక్కడ్నుంచే ప్రారంభించారు. ఈ రెండు సందర్భాల్లోనూ అనేక హామీలిచ్చారు. ఏడాది గడుస్తున్నా ఏ హామీ పూర్తిగా అమలైన దాఖలాల్లేవు. మరికొన్ని హామీల్లో కదలిక కూడా లేదు. ఇచ్ఛాపురంలో ఐదో విడత జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకొస్తున్న నేపథ్యంలో జిల్లాకు ఆయన ఇచ్చిన హామీలు, వాటి అమలుపై ప్రత్యేక కథనం.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, జిల్లాను సస్యశామలం చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాకొచ్చిన ప్రతిసారీ చెప్తున్నా, ప్రాజెక్టులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సాగునీటి ప్రాజెక్టుల్లో వంశధార ప్రాజెక్టు ఒకటి. వాస్తవానికి హిరమండలం జలాశయాన్ని జనవరి ఐదో తేదీన ప్రారంభించనున్నట్లు తొలుత ప్రకటించింది. పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడంతో ఫిబ్రవరికి వాయిదా వేసుకుంది. పనుల్లో జాప్యం జరుగుతుండడంతో, పనుల పూర్తికి ఒప్పంద కాలపరిమితిని పొడిగించుకుంటూ వెళ్తోంది. 87వ ప్యాకేజీకి సంబంధించిన పనులు ఇప్పటివరకు 31.19 శాతం మాత్రమే జరిగాయి. 88వ ప్యాకేజీ పనులకు సంబంధించి 51.97 శాతం మాత్రమే జరిగాయి. హిరమండలం రిజర్వాయర్ పనులు 72.81 శాతం పూర్తయ్యాయి.

అమలు కాని సాగునీటి ప్రాజెక్టు హామీలు

తోటపల్లి ప్రాజెక్టు పాత రెగ్యులేటరీ ఆధునికీకరణ పనులకు (మిగతా...4లో)



వణికిస్తున్న చలి

- తగ్గిన ఉష్ణోగ్రతలు
- దట్టంగా కురుస్తున్న మంచు



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో చలి తీవ్రత పెరుగుతోంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు క్రమేణా తగ్గడంతో ఈ పరిస్థితి నెలకొంది. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 25 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదవుతుంటే, రాత్రి వేళ ఉష్ణోగ్రతలు 22 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. దీంతో జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల గాలిలో తేమ శాతం పెరుగుతోంది. పెరుగుతున్న కాలుష్యానికి తేమగాలులు తోడవడంతో జనం (మిగతా...4లో)

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

ప్రజాశక్తి-సంతబొమ్మాళి

మండలంలో నౌపడ ఆదర్శ పాఠశాల, కాపుగోదాయవలసలోని ఎంపియుపి పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రామారావు, రామకృష్ణ, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, ఆనందరావు, సామ సంజీవరావు, చిన్నారావు పాల్గొన్నారు.

హిరమండలం: స్థానిక ఆదర్శ పాఠశాల ప్రధానోపాద్యాయులు కె.సింహాచలం ఆధ్వర్యంలో మండలంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాతహిరమండలం, ఆదర్శ పాఠశాలలతో పాటు శ్రీనారాయణ పాఠశాలలో పూలే జయంతి నిర్వహించారు.కార్యక్రమంలో సంబంధిత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ,తదితరులు ఉన్నారు.

పాతపట్నం: మేజర్ పంచాయతీలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో స్థానిక ఎంపిటిసి చిన్నాల విశ్వనాధం మఖ్య అతిదిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రామరాజు,పెద్దసీది జెడ్పీహెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయుడు డి.జీవనరావు టిడిపి నాయకులు ఇప్పలి ధనుంజయరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకొండ: మండలంలోని అంపిలి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.మహేష్ , మండల యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు షన్ముఖరావు ,యుటిఎఫ్ మండల అధ్యక్షులు పిఎన్ శివాజీ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు.

ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో: జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బుధవారం పెదకాపు వీధి మోడల్‌స్కూల్‌లో కూడా వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు అచ్చుతరావు, సంపత్‌కుమార్, పాఠశాల హెచ్ఎం టి.గోవిందరావు, కె.ఎన్.వి.ప్రసాద్, వెంకట రావు తదితరు లున్నారు.



టెక్కలిలో బూరగాం పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కొండపల్లి గౌరునాయుడు పాల్గొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండల అధ్యక్షులు జి.త్రినాధనాయుడు అధ్యక్షతన ఇన్‌ఛార్జి హెచ్ఎం జనార్ధనమ్మకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పైడిరాజు, గణేష్, ముకుంథరావు, దుర్గాప్రసాద్, సతీష్, శ్రీనివాసరావు ఉన్నారు.

టెక్కలి: యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పాలవలస ధర్మారావు ఆధ్వర్యంలో బూరగాం ఉన్నత పాఠశాల ఆవరణలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని సీతాపురం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సత్తారు వేణికుమారి, నర్సింగపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం నారాయణమూర్తి, పెద్దసాన ప్రాథమికోన్నత పాఠశాలలో డి.ఎ.స్టాలిన్‌ల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. అలాగే స్థానిక మధర్‌థెరీసా ఉన్నత పాఠశాలలో కె.గీత, డైరెక్టర్ దువ్వాడ చంద్రమోహన్‌ల ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. దళిత ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా రామారావు ఆధ్వర్యంలో మండలంలోని పాతనౌపడ గ్రామంలో పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు మహిళా ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహించారు.

తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-పాలకొండ

బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని స్థానిక ఎంఎల్‌ఎ విశ్వాసరాయి కళావతి అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొండకోనలకు, అడవుల్లో నాగరిక సమాజానికి దూరంగా ఉన్న నిజమైన ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. నిర్ధిష్టమైన సంస్కృతి, ఆదిమ లక్షణాలు గోచరించుట, భౌగోళికంగా విడిగా ఉండడం, ఇతరులతో సంబంధాలు నెరపడానికి బెరుకు చూపడం, వెనుకబాటుతనం ఉండాలన్నారు. పై అర్హతలేని బోయ, వాల్మీకి కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చి చరిత్రకు అన్యాయం చేయెద్దన్నారు. దీనిపై వెంటనే ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

వీరఘట్టంలో వైద్యపరీక్షలు

వీరఘట్టం:మండలంలోని వండువ, అడారు, బిటివాడ గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరంలో 150 మందికి వైద్యపరీక్షలు వైద్యాధికారులు ఎం.శృతి, ఎస్ఎస్ వర్మలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌తో పాటు ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హిరమండలం: మండలంలోని గులుమూరు పంచాయతీలో హిరమండలం పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.రాజేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన 86 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులను అందజేశారు. పరిసరాల పరిశుభ్రతను పాటించినట్లయితే వ్యాధులు సంభవించవని ప్రజలకు సూచించారు.ఈయనతో పర్యవేక్షకులు గణపతి తదితరులు ఉన్నారు.

ఎన్ఎంయు రిలే దీక్షలు

పాలకొండ: ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఎన్ఎంయు ఆధ్వర్యంలో కార్మికులు రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎంయు రీజనల్ నాయకులు కెఆర్ఎస్ పట్నాయక్ మాట్లాడుతూ ఒటి డ్యూటీలు తగ్గించి చట్టప్రకారం 8 గంటల డ్యూటీలు వేయాలన్నారు. సిక్కులపై జీతాలు ఇవ్వాలన్నారు. ఏడు గంటలు పైబడి డ్యూటీలు రద్దుచేయాలన్నారు. అన్ని డిపోల్లో కొత్త డిమ్స్ ఇవ్వాలన్నారు. మహిళా కండక్టర్లకు ప్రత్యేక డ్యూటీలు వేయాలన్నారు. విజయనగరం, పాలకొండ, శ్రీకాకుళం డిపో గ్యారేజీల్లో సూపర్‌వైజర్లు పక్షపాత వైఖరి విడనాడాలన్నారు. దీక్షలు చేపట్టిన వారిలో పట్నాయక్‌తో పాటు ఎం.వైకుంఠరావు, డిజెబాబు, వైఎన్ రావు, ఆర్ఎన్ రావు, వి.జి.నాయుడు, పి.జి.రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి బి.సూర్య హాజరై మద్ధతు తెలిపారు.

శిబిరాలను విజయవంతం చేయాలి

హిరమండలం: హిరమండలం మేజర్ పంచాయతీ నౌగూడ, సుభలాయ్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాలను విజయవంతం చేయాలని స్థానిక శ్రీరామేశ్వరి విద్యాసంస్థల ప్రిన్సిపల్ ఎల్.యుగంధర్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల నాలుగు నుంచి పది వరకు సేవా శిబిరాలను నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమాలను బిఆర్.అంబేద్కర్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎం.అనురాధ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత గ్రామాల్లో బహిరంగ మలవిసర్జనతో కలిగే అనర్థాలు, సామాజిక ఆర్థిక సర్వే, స్వచ్ఛభారత్, అక్షరాస్యత, శ్రమదానం నిర్వహించనున్నామన్నారు. ఈయనతో ఎన్ఎస్ఎస్ పిఒలు బి.సురేష్, పి.యతిరాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'జన్మభూమి - మా ఊరు'

ప్రజాశక్తి-సంతబొమ్మాళి

మేఘవరం గ్రామంలో నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో వివిధ సమస్యలపై ప్రజలు అధికారులను నిలదీశారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా బుధవారం మేఘవరం, మరువాడ, రఘునాధపురం, ఆర్.హెచ్.పురం పంచాయతీల్లో జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు మేఘవరంలో 310 మందికి వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరైతే 27 మందికే బిల్లులు అందజేయడంలో ఆంతర్యమేమిటని గుంటు రామారావు, మాజీ సర్పంచ్ వి.సోమేశ్వరరావు, శంకరరెడ్డి ప్రశ్నించారు. ఇంకుడు గుంతలు నిర్మించాలని చెప్పిన అధికారులు బిల్లులు మంజూరులో అలసత్వం వహించడం సరికాదని డి.కూర్మారావు వాగ్వివాదానికి దిగారు. వంద మంది రేషన్ కార్డులు కోసం దరఖాస్తులు చేస్తే ఐదుగురికి మాత్రమే మంజూరు చేశారన్నారు. ముగ్గురికి పింఛన్లు మంజూరు చేశారని, వీరిలో ఒక మహిళ మరణించారన్నారు. సమస్యలు పరిష్కరించలే నప్పుడు ఇటువంటి కార్యక్రమాలు ఎందుకు నిర్వహించాలన్నారు.

కార్యక్రమంలో తహశీల్దార్ రామారావు, ఎంపిడిఒ ప్రభావతి, ఎంపిపి కె.కృష్ణవేణి, జెడ్‌పిటిసి లమ్మత లక్ష్మి, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్.ఎల్.నాయుడు, జన్మభూమి కమిటీ అధ్యక్షులు కె.విష్ణుమూర్తి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నందిగాం: తహశీల్దార్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండలములోని లఖిదాసుపురం,దిమిలాడ, బడగాం దేవిపురం గ్రామాలలో జన్మభూమి ఐదో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా సర్పంచులు లోకనాథం ఏ సావిత్రమ్మ ఎస్.కలవయ్య. సిస్తుగున్నయ్య అధ్యక్షతన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాంబాబు, ఇఒపిఆర్డీ రాజారావు ఆనందరావు తదితరులు ఉన్నారు.



జలుమూరు: సుబ్రహ్మణ్యపురం గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వాసుదేవరావు

జలుమూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలని జన్మభూమి - మా ఊరు కార్యక్రమము లో అధికారులు సూచించారు. గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న గ్రామ సభలలో ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాలతో పాటు మరుగుదొడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రజలు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. తహశీల్దార్ ప్రవళికప్రియా ఆధ్వర్యంలో దరివాడ, తలతరియా గ్రామ పంచాయతీలలో నిర్వహించిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో అధికారులు మరుగుదొడ్ల నిర్మాణ అంశంపైనే ఎక్కువగా మాట్లాడారు. ఉండడానికి ఇల్లు మంజూరు చేయరు కానీ మరుగుదొడ్డి నిర్మించుకోవాలని లేకుంటే పింఛన్లు, రేషన్ నిలుపుదల చేస్తామని అంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎంపిడిఒ పడాల వాసుదేవరావు ఆధ్వర్యంలో వెంకటాపురం,సుబ్రమణ్యపురం పంచాయతీలలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పింఛన్ల కోసం పలువురు ఆర్జీలు చేసుకున్నారు. కార్యక్రమములో ఆయా పంచాయతీల సర్పంచులు పైడి విశ్రావు, వెలమల రామారావు, కూన కేశవరావు, చల్ల జయలక్ష్మి, జన్మభూమి కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు వెలమల రాజేంద్ర నాయుడు, మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

పోలాకి: మండలంలోని ఈదులవలస, కెపివలస, తలసముద్రం, రాళ్లపాడు గ్రామ పంచాయతీల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపిడిఒ అలివేలుమంగమ్మ , తహశీల్దార్ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో రాళ్లపాడు సర్పంచ్ చిట్టి పావని, సింహాచలం, కెపివలస సర్పంచ్ లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి -నందిగాం

విద్యార్థి దశ నుంచే సానుకూల దృక్పథంతో విద్యార్థులు ముందుకు సాగాలని నందిగాం జడ్పీటీసీ సభ్యులు కె. బాలకృష్ణారావు సూచించారు.బుధవారం మండల కేంద్రమైన నందిగాం స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల మరియు కళాశాలల కళాశాలల విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని జడ్పిటిసి ప్రారంభించారు స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఆధ్వర్యములో ఏడు రోజుల పాటు ఎన్ ఎస్ఎస్ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా శిబిరాన్ని జడ్పిటిసి ప్రారంభించారు. సేవా కార్యక్రమాలను విస్తృతపరిచి సమాజాభివృద్ధికి పాటుపడాలని అన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జడ్పిటిసి మాట్లాడుతూ వలంటీర్లు తమదైన శైలిలో పనిచేయాలని అన్నారు. ఎన్ఎస్ఎస్ ఉద్దేశాన్ని నిర్వర్తించాలని ఆకాంక్షించారు. అనంతరం మెయిన్ వీధి లో స్వచ్ఛభారత్ చేపట్టారు ప్రిన్సిపాల్ బి.కూర్మారావు.ఉపాధ్యాయులు కె వైకుంఠరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులకున్న అర్హతేమిటి?

వైసిపి నగర అధ్యక్షులు సాధు వైకుంఠరావు



మాట్లాడుతున్న సాధు వైకుంఠరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వం ప్రజాధనాన్ని వెచ్చించి నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమంలో ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి వేదికలపై టిడిపి నాయకులు కూర్చోడానికి ఉన్న అర్హతలేంటని వైసిపి నగర అధ్యక్షులు సాధు వైకుంఠరావు ప్రశ్నించారు. బుధవారం స్థానిక ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదో విడత జన్మభూమి కార్యక్రమం మొదటి రోజునే టిడిపి నాయకులు అవినీతి బట్టబయలైందన్నారు. నగరానికి చెందిన టిడిపి నాయకులు స్థానిక ఎమ్మెల్యేకు షాడోగా వ్యవహరిస్తూ జన్మభూమి వేదికలపై కలిసి కూర్చోవడం చర్చనీయంగా మారిందన్నారు. టిడిపి నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని అనడానికి ఇదే నిదర్శనమన్నారు. నిజాయితీగా ప్రజలకు సేవలు అందిస్తున్న అధికారులను సాగనంపుతున్న ఘనత స్థానిక ప్రజాప్రతినిధులకే దక్కుతుందని విమర్శించారు. నీతి నిజాయితీ పేరు చెబుతూ నగర ప్రజలను టిడిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు నమ్మకద్రోహం చేస్తున్నారని విమర్శించారు. నగరంలో అవినీతిని పెంచి పోషిస్తున్న వారు జన్మభూమి కార్యక్రమాలతో ప్రజలకు ఎటువంటి మేలు చేస్తారని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నాయకులు టి.కామేశ్వరి, చిట్టి రామారావు, కోరగ రమేష్, సుగుణారెడ్డి పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్



మృతి చెందిన చిన్నమ్మి

ఆటో బోల్తా : మహిళ దుర్మరణం

ప్రజాశక్తి- హిరమండలం

మండలంలోని తుంగతంపర సమీపంలో నవతల-ముఖలింగం రహదారిపై మంగళవారం రాత్రి ఆటో బోల్తా పడిన సంఘటనలో పల్లి చిన్నమ్మి (63) మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... పాతపట్నం నుంచి హిరమండలానికి వస్తున్న ఆటోలో ఏడుగురు ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. ఇందులో ఎల్ఎన్‌పేట మండలం బొర్రంపేటకు చెందిన పల్లి చిన్నమ్మి, బూరవల్లి కృష్ణమూర్తి, పాగోటి అక్కమ్మ, కేవటి కుంతి, శ్రీనులు ప్రయాణిస్తున్నారు. తుంగతంపర వద్దకు వచ్చేసరికి ఆటో ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అందరూ గాయపడ్డారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చిన్నమ్మి మృతి చెందింది. మృతురాలు కుమారుడు పల్లి లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు కేసు ఎస్ఐ కె.వెంకటేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభాభారతి మనుమడు ఆకస్మిక మృతి

ప్రజాశక్తి- రాజాం

రాజాం నియోజకవర్గ అధికార పార్టీ ఇన్‌ఛార్జ్, మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి మనుమడు మంగళవారం రాత్రి విశాఖపట్నంలోని ఆమె నివాసగృహంలో ఆకస్మికంగా మృతి చెందాడు. ఆమె కుమార్తె, రాజాం సామాజిక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్పన్ గ్రీష్మాప్రసాద్‌కు ఏకైక కుమారుడైన విఖ్యాత (విక్కీ) (6) గతంలో ఆస్తమాతో బాధపడుతూ ఉండేవాడు. మంగళవారం రాత్రి నిద్రలో ఉండగా పలబారిపోయి, ఆస్తమాతో ఊపిరాడక మృతి చెందాడని బంధువులు తెలిపారు. బుధవారం ఉదయం సంతకవిటి మండలం కావలి గ్రామంలోని తమ స్వగృహానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై తమ సానుభూతిని తెలిపారు.



మృతి చెందిన విఖ్యాత్



వైద్యశిబిరంలో రోగులకు వైద్యపరీక్షలు

బిఆర్ఎయు ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ ఆధ్వర్యాన మండలంలోని బుడగట్లపాలెంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి హాజరైన గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యులు దేవీప్రసాద్ వైద్యసేవలు అందించారు. వర్సిటీ పరీక్షల విభాగాధిపతి తమ్మినేని కామరాజు పాల్గొన్నారు.

సావిత్రిభాయి పూలే ఆదర్శం

శ్రీకాకుళం రూరల్ : మండలంలో పెదపాడులోని ఎపి సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపల్ వై.యశోదలక్ష్మి ఆధ్వర్యాన సావిత్రిభాయి పూలే జయంతి వేడుకల్లో ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ఓటింగ్ పద్ధతిలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన ఉపాధ్యాయులను ఎన్నుకున్నారు. మండలంలోని రాగోలు జిల్లా ప్రాథమికోన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి హెచ్ఎం కె.జయలక్ష్మి ఆధ్వర్యాన సావిత్రిభాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- రణస్థలం

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపైనా ఉందని ప్రముఖ సంఘ సేవకులు, అవార్డు గ్రహీత మేకా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొండములగాం గ్రామ సమీపంలో ఉన్న ఎం.ఎస్.అతిథి గృహం ప్రాంగణంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నారు. ఇంటి ఆవరణ, పొలాల గట్లపై చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు విజయ్, సోమరాజు, గురుమూర్తి, భాస్కరరావు, వేదుల రామకృష్ణ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న మేకా శ్రీనివాస్, తదితరులు

ఫరీదుపేట రోడ్డు నాణ్యత తనిఖీ



శాంపిల్స్‌ను సేకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని కొయిరాల కూడలి జాతీయ రహదారి నుంచి ఫరీదుపేట వరకూ నిర్మిస్తున్న తారు రోడ్డు నిర్మాణ నాణ్యతను పంచాయతీరాజ్ విజిలెన్స్ అండ్ క్వాలిటీ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. రూ.37లక్షలతో చేపడుతున్న ఈ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడటం లేదని గ్రామానికి చెందిన మొదలవలస చిరంజీవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. 1.5 కిలోమీటర్ల దూరం గల ఈ రోడ్డులో పలు చోట్ల శాంపిల్స్ చేకరించారు. దీనికి సంబంధించిన నివేదిక వారం రోజుల్లో కలెక్టర్‌కు అందజేస్తామని విజిలెన్స్ డిఇ కె.ఎం.వి.ప్రసాద్ తెలిపారు. ఫరీదుపేట అతి సున్నితమైన గ్రామం కావడంతో పోలీసుల సమక్షంలో ఈ తనిఖీలు చేశారు. వారి వెంట పంచాయతీరాజ్ డిఇ బుద్ధప్రసాద్ ఉన్నారు.

రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కుంచాల కురమయ్యపేటలో ఉన్న శ్రీచక్రపురంలో ఇంత మంచి ఆలయం ఉందా? అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు దేశ రక్షణశాఖ మంత్రి నిర్మలాసీతారామన్. ఢిల్లీలో ఆమె కార్యాలయంలో శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్నాయుడు ఆధ్వర్యాన బుధవారం శ్రీచక్రపురం పీఠాధిపతి బాలభాస్కరశర్మ, యాగా నిర్వహణ కమిటీ సభ్యులు, ట్రస్టు సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శ్రీచక్రపురం గురించి అక్కడ జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం గతంలో చేసిన కార్యక్రమాల చిత్రమాలికల అల్బమ్‌ను చూపించారు. ఫిబ్రవరి నెలలో మహాయజ్ఞం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి తమరు తప్పక రావాలని ఎంపీ కోరారు. కార్యక్రమంలో శ్రీశివానీ కళాశాల యాజమాన్య ప్రతినిధి దుప్పల వెంకటరావు, అంబేద్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గుంట తులసీరావు, దేశవ్యాప్త ప్రచార విభాగ కార్యదర్శి గులోనా, స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు గీతాశ్రీకాంత్, వ్యాపారవేత్త జయరాం, పైడి చందులు పాల్గొన్నారు.



ఆహ్వానిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

'చంద్రన్న బీమా' అందజేత

పలాస: మున్సిపాలిటీలో 15వ వార్డు తిలక్‌నగర్‌కు చెందిన జన్ని రామారావు ఇటీవల మృతి చెందారు. ఆయన భార్య భాగ్యలక్ష్మికి బుధవారం వార్డు కౌన్సిలర్, వైసిపి పట్టణ కన్వీనర్ దువ్వాడ శ్రీకాంత్ చంద్రన్న బీమా పథకం కింద రూ.ఐదు వేలు నగదు అందజేశారు. మిగతా రూ.1.95 లక్షలను ఆమె బ్యాంకుఖాతాలో జమ చేస్తామని బీమా మిత్ర తులసి తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.గణపతి, సూరిబాబు, బి.ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

రామారావు మృతికి సంతాపం

ప్రజాశక్తి పలాస డివిజన్ ఆర్గనైజర్ జన్ని రామారావు అకాల మృతిపై వజ్రపుకొత్తూరు మండల ప్రెస్‌క్లబ్ సభ్యులు ప్రగాఢ సంతాపం తెలిపారు. సంతాపం తెలిపినవారిలో బి.చలపతిరావు, పి.శోభన్, జి.శ్రీనివాసరావు, కె.నారాయణరావు, కె.చలపతిరావు, ఎన్‌జిఒ నాయకులు జి.సోమేశ్వరరావు, గోపాలు తదితరులు ఉన్నారు.



రామారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న శివాజీ



భాగ్యలక్ష్మికి చంద్రన్న బీమా అందజేస్తున్న శ్రీకాంత్

ఎమ్మెల్యే శివాజీ పరామర్శ

మందస: జన్ని రామారావు కుటుంబాన్ని బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. రామారావు భార్య భాగ్యలక్ష్మితో మాట్లాడి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అభ్యుదయ భావాలతో పనిచేశారని, ఆయన మృతి ప్రజాశక్తి దినపత్రికకు తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి హుదూద్ ఇల్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పి.విఠల్‌రావు, ఎన్.దూర్వాసులు, ఎల్.రుద్రయ్య, వాసు, బి.కర్రయ్య తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

రామారావు కుటుంబాన్ని పలాస-కాశీబుగ్గ మాజీ మున్సిపల్ ఛైర్మన్ వజ్జ బాబూరావు పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం మృతుని భార్య భాగ్యలక్ష్మికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయనతోపాటు మాజీ కౌన్సిలర్లు బి.గిరిబాబు, డి.భవానీ శంకర్, కౌన్సిలర్ ప్రతినిధి బి.పులిరాజు ఉన్నారు.

అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి రామారావు అని యుడిఎఫ్ ప్రతినిధులు ఎస్.రామారావు, గాంధీవర్మ, బి.దేవరాజు కొనియాడారు. బుధవారం హరిపురంలోని ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.



భాగ్యలక్ష్మిని పరామర్శిస్తున్న బాబూరావు

బాబును నమ్మి మోసపోవద్దు

- మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- మత్స్యకారుల దీక్షలకు సంఘీభావం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎస్‌టి జాబితాలో చేర్చుతామని పదేపదే ప్రకటిస్తూ, మత్స్యకారులను మభ్యపెడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మరోమారు నమ్మి మోసపోవద్దని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఎస్‌టిల్లో చేర్చాలని మత్స్యకార ఎస్‌టి సాధన కమిటీ ఆధ్వర్యాన మత్స్యకారులు కలెక్టరేట్ వద్ద చేపడుతున్న రిలే దీక్షలు బుధవారానికి 24 రోజులకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు సంఘీభావం తెలిపిన అనంతరం ధర్మాన మాట్లాడారు. జిల్లా పర్యటనకు వస్తున్న చంద్రబాబునాయుడు మత్స్యకారుల దీక్షా శిబిరాన్ని సందర్శించి, వారికి నమ్మకం కలిగించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ అమల్లో చిత్తశుద్ధి లేని అధికారపార్టీ మంత్రులు, ప్రజాప్రతినిధులు మత్స్యకారులకు సంఘీభావం తెలిపే నైతిక హక్కు లేదన్నారు. శిబిరాల వద్ద అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు మొసలికన్నీరు కారుస్తూ మరోమారు వారిని వంచించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మత్స్యకారులకు 50 ఏళ్లకే పింఛన్, జిల్లాలో మత్స్యకారునికి ఎమ్మెల్సీగా అవకాశం, ఎస్‌టి జాబితాల్లో చేర్చుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సాధించుకోవడానికే మత్స్యకారులు పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఆయన వెంట నాయకులు తాతబాబు, రవికుమార్ ఉన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న మత్స్యకారులు

ఎస్‌టి జాబితాలో చేర్చాలని ర్యాలీ

ఇచ్ఛాపురం : మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్పించాలని కోరుతూ బుధవారం డొంకూరు గ్రామంలో తీర ప్రాంత మత్స్యకారుల ఐక్యవేదిక ఆధ్వర్యాన మత్స్యకారులు భారీ ర్యాలీ నిర్వహించారు. మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని, తీరం మా హక్కు అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు సిహెచ్.గురుమూర్తి, సర్పంచ్ ప్రతినిధి జానకిరావు, సిహెచ్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

పలాస: మున్సిపాలిటీలోని ఐదో వార్డు చినబాడాం ఉన్నత పాఠశాలలోని 6,7,8 తరగతులకు చెందిన 296 మంది విద్యార్థులకు బుధవారం వార్డు కౌన్సిలర్ కోత అరుణకుమారి యూనిఫాం అందజేశారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సుభాష్, ఎన్.షణ్ముఖరావు, డి.కృష్ణమూర్తి, బి.శ్రీనివాసరావు, లక్ష్మిబాయి, తదితరులు పాల్గొన్నారు.


యూనిఫాం పంపిణీ చేస్తున్న అరుణకుమారి

కిడ్నీ రోగులకు మందులు పంపిణీ

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

మండలంలోని పల్లిసారథి, గుణుపల్లి, మెట్టూరు, డోకులపాడు గ్రామాల్లోని 400 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు బుధవారం మిషన్ ఉద్దానం, యునైటెడ్ ఆఫ్ అమెరికా సొసైటీ ఆధ్వర్యాన రూ.10 లక్షలు విలువ చేసే మందులు అందజేశారు. కార్యక్రమంలో అమెరికా బృంద వైద్యులు కె.కుమార్, ఆకుల రవి, హైదరాబాద్ బృందం వైద్యులు దుర్గారావు, కిరణ్‌కుమార్, శైలజ మందులు పంపిణీ చేశారు.

కవిటి: మండలంలోని వై.జి.పుట్టుగ, సహలాలపుట్టుగ, తొత్తిడిపుట్టుగ గ్రామాల్లోని కిడ్నీ రోగులకు బుధవారం అమెరికాలోని తెలుగు వైద్య బృందం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం బృందం సభ్యులు కుమార్, ఎ.రవి, రఘు, ఆర్.సూర్యప్రకాష్ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ ఈ ప్రాంతానికి వచ్చిన తరువాత కిడ్నీ వ్యాధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో సోంపేట వైద్యులు వై.కృష్ణమూర్తి, దాసరి వాసు తదితరులు పాల్గొన్నారు.



కవిటి : మందులు అందజేస్తున్న బృందం సభ్యులు

విద్యార్థులకు క్రీడలు అవసరం

ప్రజాశక్తి - పలాస రూరల్

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని బొడ్డపాడు ఎంపిటిసి ఎం.రామారావు అన్నారు. జన్మభూమి-మాఊరులో భాగంగా బొడ్డపాడు ఉన్నత పాఠశాలలో బుధవారం ముగ్గుల పోటీలు, వాలీబాల్, క్యారమ్స్ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. విజేతలకు గ్రామసభల్లో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం సిహెచ్.రాంజీ, విద్యా కమిటీ చైర్మన్ ఎస్.గుణవంతరావు, పంచాయతీ కార్యదర్శి జానకి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

సోంపేట : బారువకు చెందిన పందిరి సుమంత్ పట్టణంలోని సంస్కార భారతి విద్యాసంస్థలో చదువుతున్నాడు. ఇటీవల సంభవించిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి గాయపడ్డాడు. సహ విద్యార్థి వైద్య సేవలు నిమిత్తం విద్యార్థులు రూ.50,300 విరాళంగా సేకరించి కుటుంబసభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.తారకేశ్వరరావు, సంస్కార భారతి విద్యాసంస్థల చైర్మన్ వై.దేవరాజు, కరస్పాండెంట్ ఎన్.దాసు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మందస : మండలంలోని సవరరాజపురం గ్రామంలో సవర కామేశ్వరరావుకు చెందిన 38 బస్తాల ధాన్యం ఇటీవల అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న పలాస నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం బాధితున్ని పరామర్శించి, ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు ఎ.సూర్యారావు, వైసిపి జిల్లా కార్యదర్శి ఎం.కుమారస్వామి, డి.జానకిరావు, జి.శ్రీను తదితరులు ఉన్నారు.

కదలని ప్రగతి రథం

నిధులు కేటాయిస్తామని వీరఘట్టం మండలం తెట్టంగి సభలో చంద్రబాబునాయుడు ప్రకటించినా, అందులోనూ కదలిక లేదు. అధికారులు రూ.260 కోట్లతో కొత్తగా అంచనాలను రూపొందించి, ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదు. అదే సభలో జంపరకోట జలాశయాన్ని పూర్తి చేస్తామని చెప్పినా, అది కూడా పెండింగ్‌లో ఉంది. జంపరకోట బ్యాలెన్స్ పనులకు సంబంధించి రూ.18 కోట్లతో ప్రతిపాదనలు పంపినా, వాటికి ప్రభుత్వం నేటివరకూ ఆమోదం తెలపలేదు. తోటపల్లి ప్రాజెక్టును తామే పూర్తి చేశామని సిఎం చంద్రబాబునాయుడు పలుమార్లు చెప్పుకుంటున్నా డిస్ట్రిబ్యూటరీలు, ఉప, పిల్ల కాలువల తవ్వకాలు ఇంకా పూర్తి కాలేదు. పనుల కోసం 98.74 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనుల ప్రగతి నామమాత్రంగానే ఉంది. మట్టి, సిమెంట్ పనులు చాలా నెమ్మదిగా సాగుతున్నాయి. ఆర్‌అండ్‌ఆర్ అంశం కూడా అపరిష్కృతంగానే ఉంది.

ఉద్దానం సాయం అధ్వానం

ఉద్దానం కిడ్నీ బాధితులను అన్నివిధాలుగా ఆదుకుంటామని రాజాంలో నిర్వహించిన జన్మభూమి సభలో ప్రకటించినా, సాయం అరకొరగానే ఉంది. ఇచ్చిన హామీలు అరకొరగానే అమలయ్యాయి. కిడ్నీ బాధితులకు రూ.2,500 పింఛన్ ఇస్తామని ప్రకటించినా, సాయానికి ప్రభుత్వం అనేక నిబంధనలను నిబంధనలు విధించింది. డయాలసిస్ దశలో ఉన్న వారికి, అదీ ప్రభుత్వాస్పత్రుల్లో చేయించుకున్న వారు మాత్రమే అర్హులని పేర్కొంటూ సాయాన్ని కొద్దిమందికి మాత్రమే పరిమితం చేసింది. జిల్లాలో 1,01,593 మందికి స్క్రీనింగ్ చేసి, 13,093 మందిని కిడ్నీ వ్యాధిగ్రస్తులుగా అధికారులు తేల్చారు. వీరిలో ప్రభుత్వం కేవలం 317 మందికి మాత్రమే పింఛన్‌ను అందిస్తోంది. తెట్టంగి సభలో ప్రయివేట్ ఆస్పత్రుల్లో చేయించుకున్న వారికీ అందిస్తామని సిఎం ప్రకటించారు. ప్రయివేట్ ఆస్పత్రుల్లో చేయించుకున్న వారికి పింఛన్ ఇవ్వడం లేదు. వారు కూడా కేవలం 95 మంది మాత్రమే ఉన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అందిస్తామన్న శుద్ధజలం హామీకీ ఏడాది పూర్తయింది. ఇప్పటికీ వారికి శుద్ధజలం అందడం లేదు. అదీ ఉద్దానం ప్రాంత పరిధిలోని ఏడు మండలాల్లోని 135 గ్రామాలకు మాత్రమే పరిమితం చేసింది. ఇప్పటివరకు పలాసలో నిర్మించిన ఆర్‌ఒ ప్లాంట్ మాత్రమే ప్రారంభమైంది. మిగిలినవన్నీ నిర్మాణ దశలోనే ఉన్నాయి.

చక్కెర పరిశ్రమపై రైతుల ఎదురుచూపులు

ఆమదాలవలస చక్కెర పరిశ్రమను సహకార రంగంలో తెరిపించాలన్న డిమాండ్ ఇటీవల మళ్లీ ఊపందుకుంది. పరిశ్రమను తెరిపించాలంటూ ఆమదాలవలస చక్కెర పరిశ్రమ పరిరక్షణ కమిటీ, రైతులు, పరిశ్రమ సొసైటీ సభ్యులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధమవుతున్నారు. పరిశ్రమను తెరిపించేందుకు అన్ని సానుకూల అంశాలున్నట్లు వారు చెప్తున్నారు. సాగునీటి సౌకర్యం లేని రోజుల్లోనే చెరుకు దిగుబడి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో తోటపల్లి, వంశధార ప్రాజెక్టుల నీటి లభ్యత నేపథ్యంలో చెరుకు పంటకు విస్తృత అవకాశాలు పెరిగాయని చెప్తున్నారు. మరోవైపు రైతులూ చెరుకు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. వరి పంట వేయొద్దు... వాణిజ్య పంటలు వేయాలని ప్రభుత్వం రైతులకు సూచిస్తున్న నేపథ్యంలో చెరుకు పంట వేయించడం ద్వారా ప్రభుత్వ నిర్ణయం కూడా అమలు చేసినట్లవుతుంది. అన్నింటి కంటే ముఖ్యంగా ఎన్నికల ముందు ఆమదాలవలస చక్కెర పరిశ్రమను సహకార రంగంలో తెరిపిస్తామని చంద్రబాబునాయుడు హామీనీ నెరవేర్చినట్లవుతుంది. టిడిపి ఇచ్చిన హామీ వల్లే ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ గెలిచి ప్రభుత్వ విప్‌గా కొనసాగలుగుతున్నారని వారు చెప్తున్నారు. ఆమదాలవలస చక్కెర పరిశ్రమను సహకార రంగంలో తెరిచి, జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నారు.

వణికిస్తున్న చలి

రోగాల బారిన పడుతున్నారు. మరోవైపు సాయంత్రం ఆరు గంటల నుంచే మంచు కురుస్తోంది. ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు దుప్పట్లు తెరుచుకోవడం లేదు. దీని ప్రభావంతో పగటి పూట కూడా చలి వణికిస్తోంది.

జిల్లాలో వారం రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గడంతో జనం చలికి వణికిపోతున్నారు. శ్వాసకోశ వ్యాధులతో బాధపడే వారు మరింత అస్వస్థతకు గురవుతున్నారు. వృద్ధులు ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటోంది. చల్లని వాతావరణం కావడంతో మరోవైపు దోమల బెడద ఎక్కువైంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువవడంతో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఆస్తమా రోగులు, ఇతర శ్వాసకోశ వ్యాధులున్న వారికి ఈ వాతావరణం ఇబ్బంది కలిగిస్తోంది. వాతావరణంలో మార్పులు మరిన్ని రోజులు కొనసాగుతాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ప్రయివేటుకు వద్దు

ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో

మొదటి పేజీ తరువాయి

యూనియన్ నాయకులు ఎన్.గీతాబాల, బి.ధనలక్ష్మి, బి.ఉత్తర, చంద్రకళ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

ధర్మాన సంఘీభావం

వంట కార్మికుల ధర్నాకు మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ధర్మాన ప్రసాదరావు సంఘీభావం తెలిపారు. రాష్ట్రంలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో టిడిపి ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకుండా మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. కార్పొరేట్ సంస్థలకు ఈ పథకాన్ని కట్టబెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. వంట కార్మికుల పోరాటానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో మూకళ్ల తాతబాబు, చల్లా రవికుమార్ ఉన్నారు.


సంఘీభావం తెలుపుతున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

మిల్లర్లే ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రభుత్వ విప్ కూన రవికుమార్


మిల్లర్లతో మాట్లాడుతున్న విప్ రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మిల్లర్లు నేరుగా రైతుల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వ విప్ కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని వేర్‌హౌస్ గోదాంల్లో బియ్యం నిల్వలను బుధవారం ప్రారంభించారు. అనంతరం పోలీస్ స్టేషన్ దరి నియోజకవర్గస్థాయి రైస్‌మిల్లు అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో మిల్లర్లు నేరుగా రైతుల వద్దకు వెళ్లి కొనుగోలు చేసి కేంద్రాల వద్ద నమోదు చేయించుకుని రైతులకు మరింత సహాయపడాలన్నారు. రైస్‌మిల్లులు అంటే నరసన్నపేట, నిమ్మాడ ప్రాంతాల్లో ఎక్కువ పేరు వినిపిస్తుందన్నారు. జిల్లాలో ఇంకెక్కడా ఎందుకు ఈ పేరు వినిపించడం లేదని మిల్లర్లను ప్రశ్నించారు. వ్యవసాయం కూడా పరిశ్రమలా గుర్తించాలన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో బాయిల్ రైస్‌మిల్లులు మన జిల్లాలో కూడా నెలకొల్పాలన్నారు. రానున్న రెండేళ్లలో ఖరీఫ్, రబీకి జిల్లాలో 5 లక్షల ఎకరాలకు రెండు పంటలకు నీరందిస్తామని తెలిపారు. మరింత వ్యవసాయ ఉత్పత్తులు మెరుగుపడే అవకాశముందన్నారు. మిల్లర్లకు అవసరమైన గోదాంలను అన్ని మండలాల్లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. పంటలు పండే సమయంలో వర్షాలు కురవడంతో నూకలశాతం ఎక్కువుగా వస్తుందని, దీనివల్ల మిల్లర్లకు నష్టం జరుగుతుందని సువ్వారి అనీల్‌కుమార్ విప్‌కు వివరించారు. మిల్లర్లకు సహకరిస్తే రైతులకు మరింత లాభం చేకూర్చేలా మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తామని మిల్లర్లు తెలిపారు. కార్యక్రమంలో సివిల్‌సప్లయి డిఎం వెంకటరావు, జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ నాయకులు బి.రమేష్, నియోజకవర్గ రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు పేడాడ కృష్ణారావు, బోర గోవిందరావు, హరి తదితరులు పాల్గొన్నారు.


దీక్ష చేస్తున్న ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలు

ఎస్‌సి వర్గీకరణకు ఉద్యమం

'కార్పొరేషన్' ఎదుట ఎంఆర్‌పిఎస్ దీక్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో 23 ఏళ్లుగా ఎస్‌సి వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని, తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులుగా ఉన్న చంద్రబాబు, చంద్రశేఖర్‌లు ఎన్నికల ముందు ఇచ్చిన విభజన హామీ నెరవేర్చాలని కోరుతూ ఎంఆర్‌పిఎస్ ఆధ్వరాన దీక్ష చేపట్టారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట బుధవారం దీక్ష చేపట్టారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాణాశ్రీనివాస్ మాట్లాడుతూ గురువారం జిల్లాలోని ఇచ్ఛాపురం జన్మభూమి సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలు అడ్డుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దాసరి తిరుమలరావు, కానుకుర్తి శంకరమాదిగ, బానుగిరి ప్రసాద్, గొంటి పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

'వన్ స్టాఫ్' సెంటర్ ఆకస్మిక తనిఖీ

శ్రీకాకుళం సిటీ: రిమ్స్‌లోని వన్ స్టాఫ్ సెంటర్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యామలాదేవి బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గతేడాది ఆగస్టు నెల నుంచి న్యాయ సలహాదారుడిని వన్ స్టాఫ్ సెంటర్‌లో మహిళా సంక్షమశాఖ నియమించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల గృహహింస కేసులను దాఖలు చేయడం నిలిచిపోయాయన్నారు. దీంతో కక్షదారలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అనంతరం నగరంలోని బాలల పరిశీలన గృహాన్ని పరిశీలించారు. చట్టంతో విభేదించే బాలురు ఎవరూ లేరని, పరివర్తన అధికారి ద్వారా కేసులు నమోదు వివరాలను తెలుసుకోవాలని అన్నారు. పెండింగ్‌లోని 39 కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. జువైనల్ జస్టిస్ బోర్డులో రెండో సభ్యుడు నియాకం త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు.


రికార్డులను పరిశీలిస్తున్న శ్యామలాదేవి

ఘనంగా సావిత్రిభాయి పూలే జయంతి


నివాళులు అర్పిస్తున్న నేతలు


నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మహిళల్లో చైతన్య స్ఫూర్తి నింపిన ఘనత సావిత్రిభాయి పూలేకే దక్కిందని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంక్యాణ వేణుగోపాల్ అన్నారు. నగరంలోని పిఎస్‌ఎన్‌ఎం స్కూల్ ఆవరణలో బుధవారం నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. మహిళల విద్య, స్వేచ్ఛ సాధించడానికి ఆమె వీరోచిత పోరాటాలు నిర్వమించారన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి రవీంద్ర గౌరవ అతిథిగా మాజరై మాట్లాడుతూ మహిళల అక్షరాస్యత సాధించేందుకు దేశవ్యాప్తంగా చైతన్యం తీసుకొచ్చిన ఘనత సావిత్రిభాయి పూలేకే దక్కిందన్నారు. ముందుగా సావిత్రిభాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పిఎస్‌ఎన్‌ఎం స్కూల్ ప్రధానోపాధ్యాయులు సదిశివుని శంకరరావు, ఐడియల్ యూత్ క్లబ్ అధ్యక్షులు రొక్కం భాస్కరరావు, ఉపాధ్యాయులు రాధాకృష్ణాదేవి, పి.రమణకుమారి, పి.జీవరత్నం, పీడీ పైడి భాగ్యలక్ష్మి తదిరతులు పాల్గొన్నారు.

'శార్వాణి'లో...

స్త్రీ జాతిలో సావిత్రిభాయి పూలే మహిళల్లో ఆణిముత్యమని శార్వాణి విద్యా సంస్థల చైర్మన్ అంధవరపు సూరిబాబు అభిప్రాయపడ్డారు. అరసవల్లిలో గల శార్వాణి విద్యాసంస్థల ప్రధాన కార్యాలయంలో సావిత్రిభాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్ట చంద్రపతిరావు, దేవ్, దేవభూషణరావు, మూల నారాయణరావు, బోసు మన్మథరావు, జామి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉత్తేజాన్ని నింపిన వివేకానందుని బోధనలు

శ్రీకాకుళం అర్బన్: నేటి సమాజంపై ప్రభావం చూపే స్వామి వివేకానందుని బోధనలను యువత అన్వయించుకోవాలని, దీనివల్ల ప్రతి వ్యక్తిలోనూ ఉత్తేజం నింపుకునేందుకు దోహదపడతాయని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంక్యాణ వేణుగోపాల్ అన్నారు. బుధవారం నగరంలోని కౌముది డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వివేకానంద జయంతి పక్షోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. దేశసంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచస్థాయికి చాటిన ఘనత వివేకానందునికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లోలుగు లక్ష్మీపతి కౌముది డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.రామినాయుడు, తెలుగుతల్లి చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రసాద్ పాల్గొన్నారు.


నగదును అందజేస్తున్న త్రినాథమ్మ

చంద్రన్న బీమా అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని సానివాడలో బుధవారం మృతి చెందిన బి.చిన్నమ్మడు కుటుంబానికి రూ.5 వేలు నగదును జన్మభూమి కమిటీ సభ్యులు ఆర్.రమణమూర్తి అందజేశారు. తండ్యాంవలసలో మృతి చెందిన అల్లు అప్పన్న కుటుంబానికి రూ.5 వేలు నగదును ఎపిఎం త్రినాథమ్మ అందజేశారు. మిగిలిన మొత్తాలు వారి నామిని వ్యక్తిగత ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీమా మిత్ర వెంకటమ్మ, విఒ దుర్గ పాల్గొన్నారు.

నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

లూయిస్ బ్రెయిలీ జయంతిని గురువారం సాయంత్రం మూడు గంటలకు కలెక్టరేట్‌లోని డిఆర్‌డిఎ కాంప్లెక్స్‌లోని డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు టి.మల్లికార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అంధ విభిన్న ప్రతిభావంతులు కార్యక్రమంలో హజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఆన్ డ్యూటీ కింద పరిగణించనున్నామని కలెక్టర్ ఉత్తర్వులు జరీ చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పిలుపు నిచ్చారు. బుధవారం నగరంలోని పలు డివిజన్లలో నిర్వహించిన జన్మభూమి గ్రామసభల్లో హాజరై మాట్లాడారు. నగరంలోని పేదలందరికీ ఇళ్లు నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అర్హులందరికీ పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ గంగ్రేడు వెంకటేశ్వరరావు, సమాయక కమిషనర్ జీవరత్నం, టౌన్‌ప్లానింగ్ అధికారి దేవకుమార్, నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, డివిజన ఇన్‌ఛార్జిలు కమల, చిట్టి నాగభూషణం పాల్గొన్నారు.

పుణ్యపు వీధిలో ప్రత్యేక అధికారి విక్రాంత్ పాటిల్

నగరంలోని పుణ్యపువీధిలో నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో ప్రభుత్వ ప్రత్యేక అధికారి విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు. సభలో మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమిలో ప్రజలు పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.


శ్రీకాకుళం అర్బన్... మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీదేవి

రుణమాఫీ వర్తింపజేయాలి...

ఆమదాలవలస : 22, 23 వార్డులు వెంకయ్యపేట, లక్ష్మడుపేట వార్డులకు రుణమాఫీ వర్తింపు చేయాలని రైతులు చైర్‌పర్సన్ తమ్మినేని గీతను జన్మభూమిలో కోరారు. ఈ రెండు గ్రామాల భూములకు ఇనామా భూములు కావడంతో ఎటువంటి పాస్‌పుస్తకాలు గాని, పంటల నష్టపరిహారం అందడం లేదని, కొత్తగా సర్వేలు చేపట్టి ప్రభుత్వ పథకాలు వర్తించేలా చూడాలని కోరారు. 2వ వార్డు కృష్ణాపురంలో కూడా జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కె.వి.రాజ్యలక్ష్మి, కమిషనర్ బి.రాము, మేనేజర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్ దుంపల చిరంజీవి, విద్యాసాగర్, కూన అప్పలనాయుడు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన నాతో పాటు ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని జన్మభూమి-మాఊరు ప్రత్యేకాధికారి విక్రాంత్‌షెటర్ అన్నారు. మండలంలోని చాపురంలో నిర్వహించిన ఐదో విడత జన్మభూమి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం సంక్రాంతి చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. అలాగే తండ్యాంవలస, వాకలవలస, లంకాం పంచాయతీల్లోనూ జన్మభూమిని నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపిడిఒ బొడ్డేపల్లి శైలజ, సర్పంచులు కె.అర్జునరావు, చిట్టి లలిత, పి.శ్రీదేవి, ఎంపిటిసిలు ఎ.వైకుంఠం, రాజారావు, ఎం.సునీత పాల్గొన్నారు.


శ్రీకాకుళం రూరల్... మాట్లాడుతున్న విక్రాంత్‌షేటర్

'జన్మభూమి'కి ఆదరణ కరువు

ఆమదాలవలస : జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి గ్రామాల్లో ఆదరణ కరువైంది. రేషన్ కార్డులు, పింఛన్లు పంపిణీ చేయకపోవడంతో రెండో రోజు ప్రజలు మొఖం చాటేశారు. మండలంలోని జొన్నవలస, కొత్తవలస, శ్రీనివాసచార్యులపేట, చింతలపేట గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. జొన్నవలసలో 12 గంటలకు ప్రభుత్వ విప్ కూన రవికుమార్ హాజరు కాగా, గ్రామస్తులెవరూ రాకపోవడంతో సర్పంచ్ రామకృష్ణ ఇంటింటికి వెళ్లి పింఛన్లు ఇస్తామని చెప్పి సభను ప్రజలను పిలిచారు. అయినప్పటికీ ఏమీలేనప్పుడు ఎందుకీ జన్మభూమని ప్రజలు సర్పంచ్‌ను ప్రశ్నించారు. జన్మభూమి ప్రత్యేకాధికారి కర్ణాటక ఐపిఎస్ విక్రాంత్ పాటెల్ హాజరై కూడా ప్రజాసమస్యలు తెలుసుకోకపోవడం, మరుగు దొడ్లు అందరూ నిర్మించాలని చెప్పడంతో మరింత నిరుత్సాహంతో గ్రామస్తులు వెనుతిరిగారు. కార్యక్రమంలో ఎపిడి పంచాది రాధ, మండల పార్టీ అధ్యక్షులు శేఖర్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు మెట్ట సుజాత, ఎంపిడిఒ హబీబ్, తహశీల్దార్ బాబ్జీరావు, కోట గోవిందరావు, సర్పంచ్ మోహనరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
శ్రీకాకుళం
గురువారం
4-1-2018

చీకటి బతుకుల్లో 'వెలుగు'

నేడు లూయి బ్రెయిలీ జయంతి



ప్రజాశక్తి - పలాస

ఐదు నిమిషాలు కళ్లు మూసుకుంటేనే నరక ప్రాయంలా ఉంటుంది. అటువంటి జీవితాంతం చీకటిలో ఉన్న వారి జీవితాల్లో వెలుగును నింపిన మహానుభావుడు లూయి బ్రెయిలీ. ప్రస్తుతం బస్టాండ్‌లో, లిఫ్ట్‌ల్లో, మ్యాపుల్లో, సంగీత నొటేషన్స్‌లో, పుస్తకాల్లో, కంప్యూటర్ ప్రోగ్రామ్స్‌లో ఇలా ఒకదానిలో కాదు.. ప్రతీ అంశంలోనూ బ్రెయిలీ భాష ఉపయోగిస్తున్నారు. అంధులు స్వతంత్రంగా ఆలోచించగలుగుతున్నా, పలు రంగాల్లో చేరేందుకు అవసరమైన అర్హత సంపాధించగలుగుతున్నారన్నా, అందుకు కారణం బ్రెయిలీ సృష్టించిన భాషే కారణం.

ఒక గదిలాంటిది.. దానిమీద ఆరు చుక్కలు. ఇవన్నీ ఒక కాగితం మీద ఉబ్బెత్తుగా ఉండేలా తయారు చేసి, అంధులకు దారి చూపిన వారు లూయి బ్రెయిలీ. 1825 బ్రెయిలీ లిపిని ఆవిష్కరించడం ద్వారా చరిత్ర సృష్టించారు బ్రెయిలీ. అంధులు చదివేందుకు, మనసులోని భావాలు వర్ణించేందుకు అవసరమైన అంధబాషను బ్రెయిలీ తయారు చేసినప్పుడు ఆయన వయస్సు పదహారేళ్లు. కళ్లున్న మేధావివర్గం కళ్లు తెరిచి బ్రెయిలీ చూపిన ఆ కొత్త భాషను అంగీకరించేందుకు వందేళ్లు పట్టింది. 1825లో బ్రెయిలీ తన భాషను బహిర్గతం చేసినా 1920 వరకు అదొక భాష అంటూ ఎద్దేవానే సాగింది. చివరికి బ్రెయిలీ భాషలోని గొప్పతనం ప్రపంచ ప్రజలు అందరూ అంగీకరించారు.

ఒక గొప్ప భాషా విధానం కనుగొన్న బ్రెయిలీ కూడా అంధుడే. బ్రెయిలీ పుట్టకతో అంధుడు కాదు. ఫ్రాన్స్‌లోని కూవ్రే గ్రామంలో తోటవృత్తిలో ఉన్న కుటుంబంలో చివరి పిల్లాడిగా పుట్టారు. 1809 జనవరి 4న పుట్టిన బ్రెయిలీ ఒక రోజు తన తండ్రి గుర్రపు జీను కుడుతూ మధ్యలో వదిలేసి వెళ్లడం చూశారు. తండ్రి వినియోగించిన సూదిమొన కలిగిన దబ్బలం వంటి సాధనం తీసుకొని, తండ్రిని అనుకరించే ఆట ఆడుతుండగా, ఆ సూది కంట్లో గుచ్చుకుంది. కనుగుడ్డుకు గాయమైంది. కంటికి సోకిన ఇన్ఫెక్షన్ మొదట ఒక కంటికి, ఆ తరువాత రెండో కంటికి సోకి రెండు కళ్లూ పోయి, జీవితం చీకటైంది. ఏడేళ్ల వయసులో స్థానిక స్కూల్‌లో పాఠాలు విని, వెనువెంటనే వాటిని అర్థం చేసుకొని, చెప్పగలిగే ఆ క్లాస్‌లో మొదటి స్థానంలో నిలిచారు. కంటిచూపు పూర్తిగా పోయినా లూయి బ్రెయిలీ సాధారణ చదువుకు పనికిరాడు. కాబట్టి అంధుల పాఠశాలలో చేరడం మంచిదన్నారు.

ఆ విధంగా పదో ఏట ప్యారిస్‌లోని రాయల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్లైండ్ యూత్‌లో చేరారు. అప్పటికే గుడ్డివారికి పాఠాలు చెప్పేందుకు పలు రకాల పద్ధతులు అక్కడ అనుసరిస్తున్నారు. అక్షరాల్ని ఉబ్బెత్తుగా ముద్రించే పద్ధతిని అమలు చేస్తున్నారు. ఆ లిపి ఉపయోగించి తయారు చేసి, ఆ స్కూల్‌లో పెట్టిన పుస్తకాలన్నీ బ్రెయిలీ అతి త్వరలో నేర్చుకున్నారు. స్పర్శ ద్వారా అక్షరాలను తెలుసుకోవడం అనేది నాటి వరకు నేర్చుకున్న పద్ధతి. సోన్‌గ్రఫ్ అనే పద్ధతిలో ఉన్న లోపాలను గమనించిన బ్రెయిలీ దాని కన్నా మెరుగైన పద్ధతిని రూపొందించేందుకు బ్రెయిలీ ప్రయత్నించారు. అంధుల పాఠశాలలో చదువు నేర్చుకునే వారికి వీలైన ప్రత్యేక పలక, సూది, స్కేల్‌ని లూయి బ్రెయిలీ తయారు చేశారు.

1825లో ఆ కొత్త ఆరుచుక్కల భాషను అంధ విద్యార్థులు స్వాగతించినా, కళ్లున్న టీచర్లు తిరస్కరించారు. ఈ సూదితో టిక్కు టిక్కు అంటూ గుచ్చుతూరాయడం అనవసరపు ధ్వనిని సృష్టిస్తోందని, క్లాసులో చెవులకు ఇబ్బందిగా ఉందని టీచర్స్ వాదించారు. కాని అందులో ముఖ్య స్థానంలో ఉన్న ఒకరికి మాత్రం బ్రెయిలీ భాష సులభమైనదనిపించి, దాన్ని గుర్తించమని ఫ్రాన్స్ ప్రభుత్వానికి సూచించారు. నాటి ఆర్థిక పరిస్థితుల్లో అంధులకు ప్రత్యేక పాఠశాల నిర్వహణ కష్టంగా ఉండేది. ఒక పాత బిల్డింగ్ పరిశుభ్రత అంతంత మాత్రమే. పౌష్టికాహారంతో కూడిన ఆహారం దొరికేది కాదు. 16 ఏళ్ల అలాంటి వాతావరణంలో పెరిగినందుకు ఆయనకు క్షయ సోకింది. అప్పటికి ఆయన వయస్సు 26 ఏళ్లు.

ఉపాధ్యాయునిగా..

ఏ అంధ పాఠశాలలో చదువుకున్నారో అక్కడ ఉపాధ్యాయునిగా బ్రెయిలీ పని చేశారు. ఆ విధంగా అంధుల పాఠశాలలో ప్రపథమ అంధ టీచర్‌గా గుర్తింపు పొందారు. ఆ సమయంలో అంధ విద్యార్థులు వేసిన ఒక ప్రశ్న బ్రెయిలీని కదిలించింది. అంధులుగా మాకు మీ లిపి నేర్పారు. కానీ ఆ లిపి తప్పించి, మాకు మరొకటి రాదు. ఆ లిపి మా ఇంట్లో వాళ్లకు రాదు. మేము ఎలా ఉత్తరాలు రాయాలన్నది వారి ప్రశ్న. ఆ ప్రశ్నకు జవాబుగా లూయి 1893లో 'రాఫిగ్రఫీ'ని సృష్టించారు. ఇది సూది వంటిదానిలో పూర్తి ఇంగ్లీషు అక్షరాలను రాసే వీలు కల్పించే పద్ధతి. అంధుల చేతితో తాకి అక్షరాలు గుర్తించగలరు. చూపున్న వారు అక్షరాలు చూసి చదవగలరు. బ్రెయిలీ ఇంతగా ప్రయత్నిస్తున్నా అధికారికంగా గుర్తింపు రాలేదు. సంక్షిప్త ఫ్రాన్స్ చరిత్ర అనే పుస్తకాన్ని బ్రెయిలీ లిపిలో తయారు చేయించారు.

బ్రెయిలీ లిపిపై నిషేధం

బ్రెయిలీ చేస్తున్న ప్రయత్నం మంచిది కాదని, దీని వల్ల అంధులు స్వతంత్రులమనే భావన ఏర్పరచుకుని దెబ్బతింటారని, దీన్ని తీసుకురావద్దని వ్యతిరేకించారు. ఈలోగా అంధుల పాఠశాలలో బ్రెయిలీ లిపిని పూర్తిగా తిరస్కరించిన డుఫా దానికి డైరెక్టర్‌గా వచ్చారు. ఒకవైపు పైవారి వ్యతిరేకత, మరోవైపు వేధిస్తున్న క్షయ. దీంతో కొంత కాలం ఆ పాఠశాలకు దూరంగా ఉండడం మంచిదని స్వగ్రామానికి వెళ్లిపోయారు. అక్కడి పరిస్థితులు మారిపోయాయి. బ్రెయిలీ లిపిని బోధించడం నిలిపివేశారు. బ్రిటీష్ పౌరుడు జాన్ ఆల్‌స్టన్ రూపొందించిన మరో విధానం నేర్పడం మొదలుపెట్టారు. కాని అది అక్కడి అంధ విద్యార్థులకు నచ్చలేదు. బ్రెయిలీ సులభంగా ఉంటుంది. కాబట్టి దానిలోనే నేర్చుకుంటామని విద్యార్థులు ఆందోళన చేశారు. ఇది నచ్చని ఆ స్కూల్ డైరెక్టర్ బ్రెయిలీ లిపిని పూర్తిగా నాశనం చేయాలనుకున్నారు. అందుకే నాటి వరకూ స్కూల్ లైబ్రరీలో ఉన్న అన్ని బ్రెయిలీ లిపి పుస్తకాలతో పాటు, ఇతర పద్ధతుల్లో అంధుల కోసం రాసిన పుస్తకాలు అన్నింటినీ తెప్పించి స్కూల్ ప్రాంగణంలో తగలబెట్టించారు. బ్రెయిలీ కనిపెట్టిన పలక, స్కేల్, సూది వంటి వస్తువులన్నింటినీ నాశనం ధ్వంసం చేశారు. కానీ బ్రెయిలీ లిపి అంధ విద్యార్థుల మనస్సుల్లో నిక్షిప్తమైంది. ఆ లిపిని వాడితే శిక్షిస్తామన్నా విద్యార్థులు దాన్ని వదలలేదు.

అఖండ విజయం

బ్రెయిలీ లిపికి ఉన్న ఆదరణ చూసిన డైరెక్టర్ చేసేది లేక, ఆ విధానాన్ని తిరిగి స్కూల్‌లో ప్రవేశపెట్టారు. అయితే ఆ లిపికి ఒక పరీక్ష పెట్టారు. పెద్దల్లో ఒకరు ఒక అంధ విద్యార్థికి చెప్పిన పాఠం బ్రెయిలీ లిపిలో రాస్తే, మరో గదిలో ఉన్న ఆ అమ్మాయి ఆ లిపిని తడిమి చదివి చెప్పాలి. ఆ పరీక్షలో బ్రెయిలీ లిపి గెలిచింది. బ్రెయిలీ విద్యార్థులకు హీరో అయ్యారు. క్షయ ఆయన్ని చుట్టుముట్టింది. ఆఖరి రెండు ఏళ్లు అంధుల కోసం కొత్తపుస్తకాలు రాస్తూ బతికారు. 1852 జనవరి 6న మరణించారు. కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నింపిన లూయి బ్రెయిలీ మరణించే సమయానికి తన స్వగ్రామంలోనూ తగినంత గుర్తింపులేదు. ఆయన మరణం తరువాత ప్రపంచ వ్యాప్త గుర్తింపుపొందిన ఆయన జీవితం 42 ఏళ్లకే ముగిసింది.

గ్రీన్ టీతో ఆరోగ్యం



నిద్ర లేవడంతోనే టీ కోసం వెతుకులాడే ప్రతి ఒక్కరికీ మార్కెట్లో వస్తున్న కొత్త రకం తేయాకు ఉత్పత్తులు 'ఛాయ్'స్ ఈజ్ యువర్స్ అంటున్నాయి. కొద్ది రోజుల క్రితం వరకు చాయ్ అంటే పాలు, డికార్షన్ల మిశ్రమంగానే గుర్తింపు ఉంది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. లెమన్ టీ, గ్రీన్ టీ, అల్లం, మిర్యాల టీ, మసాల టీ అంటూ రకరకాల తేనీరు అందుబాటులోకి వచ్చింది. కొవ్వు పదార్థాలు కలిగిన పాలు, డికార్షన్ మిశ్రమానికి బదులు... సీజన్లకనుగుణంగా తీపి, ఉప్పు, పులుపు, ఘాటు(అల్లం, మిరియాల మిశ్రమం) తదితర రుచుల్లో ఇంటా బయటా టీ తయారు చేస్తున్నారు. యువత మొదలు వయోవృద్ధుల వరకు అన్నిటికంటే ఎక్కువగా లెమన్, గ్రీన్ టీల పట్ల ఆసక్తి చూపుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆరోగ్యం, రుచి, సత్వరశక్తి కోసం సాధారణ టీని మరిచి లెమన్, గ్రీన్ టీలకు ప్రజలు అలవాటు పడుతున్నారు. పెద్ద నగరాలకు మాత్రమే పరిమితమైన మిక్స్‌డ్ టీ కల్చర్ ప్రస్తుతం పట్టణాలకు పాకింది. చాయ్ ప్రియుల ఆసక్తి మేరకు ఎక్కడికక్కడ లెమన్, గ్రీన్ టీ విక్రయ కేంద్రాలు వెలుస్తున్నాయి. ఇదే అదనుగా కొందరు చాయ్ ప్రియులు ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు నుంచి మూడు సార్లు ఈ తరహా చాయ్ రుచులను ఆస్వాదిస్తున్నారు. లెమన్, గ్రీన్ టీ దుకాణాలను శ్రీకాకుళంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్, రామలక్ష్మణ కూడలి, జిటి రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం గమనార్హం.

తక్కువ కొవ్వు..

మారుతున్న జీవన శైలితో చిన్న, పెద్ద తేడా లేకుండా అనారోగ్యాల బారిన పడుతున్నారు. ప్రస్తుత రోజుల్లో మధుమేహం, బిపి, యాసిడిటీ, దంత సంబంధిత అనారోగ్య సమస్యలు సాధారణమై పోయాయి. దీనికితోడు పాలు, డికార్షన్ మిశ్రమంతో తయారు చేసే టీలో కొవ్వు, చక్కెర శాతం అధికంగా ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వీటి నుంచి ఉపశమనం పొందేందుకు అనారోగ్య సమస్యలతో కొందరు, ముందస్తు ఆరోగ్య సంరక్షణ కోసం మరికొందరు ఇప్పటి నుంచే లెమన్, గ్రీన్ టీలు సేవిస్తున్నారు. ఈ తరహా టీ సేవించడం వల్ల చాయ్ తాగిన అనుభూతితో పాటు సత్వర ఉపశమనం, శక్తి రెండూ శరీరానికి లభిస్తున్నాయని వారు అంటున్నారు.



టీ తయారు చేస్తున్న నిర్వాహకుడు

శరీరం తేలికగా ఉంటుంది



ఉదయాన్నే లెమన్ టీ తాగడం అలవాటు చేసుకున్నాను. ప్రణాళికాయుతంగా నిత్యం వ్యాయామ సాధన చేస్తాను. దీని వల్ల కొంత మేర బరువు తగ్గి శరీరం తేలికగా మారింది. శరీరంలో కొవ్వు శాతం తగ్గించి రుచికి రుచి సత్వర శక్తినిస్తున్నందున ప్రతిరోజూ రెండు సార్లు లెమన్ టీ తాగడం అలవాటు చేసుకున్నా.

- ఎస్.బాలకృష్ణ, హయాతినగర్

సాధారణ టీ కంటే ఎక్కువ రుచి



ఇంట్లో పాలు, డికార్షన్ మిశ్రమంతో తయారు చేసే చాయ్ తాగే వాడిని. కొద్ది రోజులుగా మిత్రులతో కలసి గ్రీన్ టీ తాగుతున్నాను. సాధారణ టీ కంటే ఎక్కువ రుచిగా ఉంటుంది. పాలలో ఉండే కొవ్వు పదార్థాలతో నోరంతా జిగటగా మారేది. ఇప్పుడా సమస్య లేదు. గ్రీన్ టీ వల్ల ఆరోగ్యంతో పాటు ఉల్లాసం కలుగుతున్నాయి.

- ఎన్.మహేష్, గుజరాతీపేట

లెమన్, గ్రీన్ టీ తయారీ ఇలా..

మరిగించిన తేయాకులతో ముందుగా డికార్షన్ తయారు చేయాలి. దాన్ని గ్లాసులో పోసి తేనె, నిమ్మరసం మిశ్రమాన్ని కలుపుతారు. అనంతరం వేడి నీటిని గ్లాసులో పోసి వాటిపై సబ్జగింజలు, పుదీన ఉంచుతారు. గరం.. గరం లెమన్ టీ తయారీ. గ్రీన్ టీలో నిమ్మరసం కలపకుండా తేనె డికార్షన్ మిశ్రమంతో తయారు చేస్తే గ్రీన్ టీ తయారవుతోంది. తీపి, పులుపు రుచుల పెంపు కోసం తేనె, నిమ్మరసం మిశ్రమాన్ని తగిన మోతాదులో పెంచుకోవచ్చు.

ఉపయోగాలిలా...

తేనెను వేడినీటిలో కలిపి తీసుకోవడం వల్ల శరీరంలో కొవ్వు శాతం తగ్గుతుంది. సబ్జ గింజలు చలువ వల్ల శరీరంలో తేమ శాతం పెరుగుతుంది. దంతాలకు మెరుపునివ్వడంతో పాటు రక్త ప్రసరణ పెరిగి దంతాలు చిగుళ్లు, దవడ కండరాలు బలపడతాయి. జీర్ణశక్తి పెరుగుతుంది.

ఆరోగ్య ప్రయోజనాలు

కేన్సర్ రాకుండా కాపాడుతుంది. శరీరంలో కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. శ్వాస సమస్యలను తగ్గిస్తుంది. హై బీపీని తగ్గిస్తుంది. గుండె జబ్బులు రాకుండా నియంత్రిస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. అలసట, ఒత్తిడిని తగ్గిస్తుంది. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. మధుమేహం లెవల్స్ పెరగకుండా చేస్తుంది. నోటి దుర్వాసనలు రాకుండా చేస్తుంది.

ఫోకస్

బాబు.. ఇదేం శిక్ష



హిరమండలం నిర్వాసిత పునరావాస కాలనీలో ఆరుబయట ఉన్న దుస్తులు, సామగ్రి



మెట్టూరులో నిర్వాసితులు వేసుకున్న గుడారాలు

- వంశధార నిర్వాసితుల పరిస్థితి దయనీయం
- తాత్కాలిక షెడ్లు, గుడారాల్లో తలదాచుకుంటున్న వైనం
- చలిలో పిల్లా పాపలతో నరకం అనుభవిస్తున్న కుటుంబాలు
- నిర్వాసితుల ఇళ్ల నేలమట్టంతో ప్రభుత్వానికి తీవ్ర అప్రతిష్ట

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార నిర్వాసితుల ఇళ్లను ప్రభుత్వం నేలమట్టం చేసి, బలవంతంగా గ్రామాల నుంచి వెళ్లగొట్టిన తర్వాత వారి పరిస్థితి దుర్భరంగా మారింది. తాత్కాలిక షెడ్లు, గుడ్డలతో వేసుకున్న గుడారాల్లో ఎముకలు కొరికే చలిలో పిల్లాపాపలతో దయనీమైన పరిస్థితుల మధ్య బతుకుతున్నారు. కనీసం కరెంట్ సౌకర్యం కూడా లేకుండా కటిక చీకట్లో కాలం వెళ్లదీస్తూ నరకం అనుభవిస్తున్నారు. నిర్వాసితుల కన్నీళ్లను, కష్టాలను చూసిన వారు చలించిపోతున్నారు. నిర్వాసితుల కన్నీళ్లు, కష్టాలపై పత్రికల్లో వస్తున్న కథనాలు జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపైనా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. రాబోయే ఎన్నికల్లో వంశధార ప్రాజెక్టు అంశాన్ని ప్రచార అంశంగా మలుచుకుని లబ్ధి పొందుదామని భావించిన ప్రభుత్వానికి నిర్వాసితుల అంశం అంతకంటే ఎక్కువ అప్రతిష్టను తెచ్చిపెట్టాయి.

వంశధార ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం తొలుత 20 గ్రామాలను నిర్వాసిత గ్రామాలుగా గుర్తించింది. ప్రస్తుతం కొత్తూరు మండలంలోని ఎన్నిరామన్నపేటను నిర్వాసిత గ్రామాల జాబితా నుంచి తొలగించింది. మిగిలిన 19 గ్రామాల్లోని ఇళ్లను అధికారులు జెసిబిలతో నేలమట్టం చేశారు. గతంలో ఎల్ఎన్‌పేట మండలం పెద్దకొల్లివలస, కొత్తూరు మండలంలోని గూనభద్ర గ్రామాలను తొలగించారు. గతేడాది సెప్టెంబర్ 14 నుంచి డిసెంబర్ 18వ తేదీ వరకు దశల వారీగా మొత్తం 17 గ్రామాల్లోని 6,770 గ్రామాలను నేలమట్టం చేసింది. పునరావాసం, పరిహారం సమస్యలను పరిష్కరించకుండానే వారిని గ్రామాల నుంచి తరిమికొట్టిందని నిర్వాసితులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. నిర్వాసితులను గ్రామాల నుంచి తరలించే విషయంలో ప్రభుత్వం, జిల్లా అధికారులు కర్కశంగా వ్యవహరించారన్న విమర్శలను మూటగట్టుకున్నారు. వరి కోతలు ప్రారంభమైనందున కొంత సమయమివ్వాలని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులను కాళ్లవేళ్లా పడి వేడుకున్నా, కాదు పొమ్మన్నారు. విద్యా సంవత్సరం ముగింపు వరకు సమయమివ్వాలని మొత్తుకున్నా, వారికి అవకాశమివ్వలేదు.

కనీసం ఇళ్లు కట్టుకునేందుకు గడువు కావాలని అడిగినా, ససేమిరా అన్నారు. ఇళ్లు కట్టుకునేందుకు కాదు కదా కనీసం అద్దెకు ఇల్లు తీసుకునే సమయం కూడా ఇవ్వలేదు. ఉన్నపళంగా ప్రభుత్వం వారిని గెంటేసింది. కాస్తాకూస్తో ఆర్థిక పరిస్థితి బాగున్న వారు ఎల్ఎన్‌పేట, హిరమండలం, కొత్తూరు గ్రామాల్లో అద్దెకు ఇళ్లను తీసుకున్నారు. అద్దెలు ఇచ్చుకోలేని నిరుపేదలు తమకు కేటాయించిన పునరావాస కాలనీల్లో తాత్కాలిక షెడ్లు, గుడ్డలతో కట్టుకున్న గుడారాల్లో దయనీయమైన పరిస్థితిలో జీవిస్తున్నారు. వంశధార నిర్వాసితుల దయనీయ పరిస్థితులపై సామాజికవేత్తలు, ఆ నియోజకవర్గ వైసిపి నాయకులతో పాటు అధికారులు, ఉద్యోగులు స్పందించారు. వారికి దుప్పట్లు, నగదును పంపిణీ చేశారు. వంశధార ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల సమస్యలను ఇప్పటికైనా ప్రభుత్వం పరిష్కరించాలి.



గూనభద్రలో కాలువపై నిర్మించిన స్నానపు గది



గాజులకొల్లివలస పునరావాస కాలనీ



కర్లెమ్మలో ఆరుబయటనే ఉన్న ధాన్యం బస్తాలు



కర్లెమ్మలో ఆరుబయట ఉన్న నిర్వాసితులు



కర్లెమ్మలో రహదారి లేని పునరావాస కాలనీ



మెట్టూరులో ఇంటి నిర్మాణానికి గొయ్యిలు తవ్వుతున్న నిర్వాసితులు



సౌకర్యాల్లేని హిరమండలంలోని పునరావాస కాలనీ



హిరమండలం: తాత్కాలిక ఇల్లును నిర్మిస్తున్న నిర్వాసితులు



గూనభద్రలో ఆరుబయట వెదురు గాదెల్లో ధాన్యం

అభివృద్ధి చేయని 'జన్మభూమి' ఎందుకు?

అధికారులపై ధ్వజమెత్తిన ఎంఎల్ఎ

సర్పంచ్ విషయంలో పాటించని ప్రోటోకాల్

వెనుదిరిగిన అధికారులు, కమిటీ సభ్యులు

వండువలో జన్మభూమి బహిష్కరణ



ఎంఎల్ఎ, జన్మభూమి కమిటీ సభ్యుల మధ్య వాగ్వివాదం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని వండువ గ్రామంలో బుధవారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని ఎంఎల్ఎ విశ్వాసరాయి కళావతితో పాటు కొంతమంది గ్రామస్తులు బహిష్కరించారు. అభివృద్ధి చేయని జన్మభూమి కార్యక్రమాలెందుకని ఎంఎల్ఎ కళావతి అధికారులపై ధ్వజమెత్తారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పలువురు వృద్ధులు జన్మభూమి కార్యక్రమంలో అధికారులకు శాపనార్థాలు పెట్టారు. తెట్టంగి, కర్నూలులో కోట్లు పరిచారనీ, మరి ఇక్కడ అభివృద్ధి కొరకు కోట్లు పరవలేదని ప్రశ్నించారు. పంచాయతీల్లో 83 రకాల పనుల కోసం రెండేళ్ల నుంచి తీర్మానం చేసి పనులు చేపట్టాలని తీర్మానం చేసి ఇచ్చామని, ఇంతవరకు ఎటువంటి పనులు చేపట్టలేదన్నారు. ఎంఎల్ఎ అంటే అంత చులకనా, అర్హత లేని జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేశారన్నారు. ఈ కారణంగా ఇరువర్గాల మధ్య పలు అంశాలపై వాగ్వివాదం చోటు చేసుకుంది. నాలుగేళ్లుగా అర్హులైన వారు దరఖాస్తులు చేస్తున్నారే తప్పా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు.

సర్పంచ్‌కు పిలవరా?

గిరిజన మహిళా సర్పంచ్‌ను కించపర్చారని, సభకు పిలవకుండా కార్యక్రమం నిర్వహించమేమిటని అధికారులను ప్రశ్నించారు. సర్పంచ్ లేనిది సభ నిర్వహించవద్దని కోరారు. సభవద్దకు ఎమ్మెల్యే వచ్చేసరికి వందేమాతరం గేయం ఆలపించిన అనంతరం అభివృద్ధి చేయని సభలెందుకని ఎంఎల్ఎ ప్రశ్నించడంతో జన్మభూమి-మాఊరు కార్యక్రమం బహిష్కరించారు. ఏకదాటిగా రెండు గంటల కాలం ఎమ్మెల్యేకు, అధికారులకు వాగ్వివాదం జరిగింది. 56 మందిలో 26 మందికే పింఛన్లు ఇస్తామనడం అన్యాయమన్నారు. ప్రభుత్వమే రాజ్యాంగాన్ని సృష్టించి బోయలను ఎస్‌టిల్లో చేర్పించడంపై తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికే దళిత, గిరిజన గ్రామాలు అభివృద్ధి లేక అనగారుతున్నారని, బోయలను ఎస్‌టిలో చేర్పిస్తే వారి జీవితాలు అభివృద్ధి చెందవని ఆమె అన్నారు.

ఘర్షణలు తలెత్తుతాయోమోనని ముందస్తుగా వీరఘట్టం, పాలకొండ ఎస్ఐలు జి.అప్పారావు, వాసునారాయణ గ్రామంలో గస్తీ ఏర్పాటు చేశారు.

పాలకొండ: నగర పంచాయతీ అధ్యక్షులు పల్లా విజయనిర్మల ఆధ్వర్యంలో వడమ, నాగవంశపువీధుల్లో జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు సిరిపురపు చూడామణి, కమిషనర్ పి.బాలాజీప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్‌కుమార్, ఆనాపు జవరాజు తదితరులున్నారు. కొండాపురంలో కార్యక్రమానికి హాజరైన ఎంపిపి వారాడ లక్ష్మి కొత్తగా మంజూరైన 12 రేషన్‌కార్డులను ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు సామంతుల దామోదరరావు, మార్కెట్‌కమిటీ అధ్యక్షులు చింత సంగంనాయుడు చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజశేఖర్, ఎంపిడిఒ తిరుపతిరావు తదితరులున్నారు.

పాతపట్నం: మండలంలో సరాళి, చంగుడి పంచాయతీల్లో తహశీల్దార్ వేణుగోపాలరావు బృందం, బడ్డుమర్రి, పెద్దలోగిడి పంచాయతీల్లో ఎంపిడిఒ బి.చిన్నమ్ముడు బృందం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, ఐటిడిఎ పిఒ ఎల్.వివశంకర్ లు ముఖ్య అతిదిలుగా పాల్గొన్నారు. బడ్డుమర్రి పంచాయతీలో ఎమ్మెల్యే పలు రోడ్లుకు శంకుస్థాపన చేశారు. మొత్తం నాలుగు పంచాయతీల్లో ఇళ్లు కాలనీ, ఫించన్లు, రేషన్‌కార్డులు తదితరాలకు 153 వినతులు వచ్చాయి సాయంత్రం ఆయా పంచాయతీల్లో పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులుఅందించారు. కార్యక్రమంలో ,పీఏసీఎస్ చైర్మెన్ ఎమ్.శ్యామసుందరరావు, అన్ని శాఖల మండలాధికారులు, టిడిపి నాయకులు పైలలక్ష్మయ్య, దువ్వారి ఉదయభాష్కర్, కొంచాడ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఇఒ

'పది'లో ఉత్తీర్ణత పెంచేందుకు చర్యలు

ప్రజాశక్తి-హిరమండలం

ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఈ నెలాఖరు నుంచి పాఠశాలలో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంఇఒ కె.రాంబాబు తెలిపారు. బుధవారం మండలంలోని గులుమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ఎంఇఒ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా సంబందిత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు సిఆర్‌పిలతో కలసి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి విద్యార్థి చదువు బాగోగులను గుర్తిస్తామన్నారు. ఇటీవల నిర్వహించిన సమ్మేటివ్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మరింత విద్యా నైపుణ్యాలను అందించనున్నట్లు తెలిపారు. ఈయనతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు తదితరులు ఉన్నారు.

మరుగుదొడ్లు తప్పనిసరి


హిరమండలం: మరుగుదొడ్లను తప్పనిసరిగా నిర్మించుకోవాలని మండల ప్రత్యేకాధికారి సిహెచ్.లక్ష్మణరావు అన్నారు. బుధవారం మండలంలోని గులుమూరు, భగరధీపురం గ్రామాల్లో జన్మభూమి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకోవాలనీ, ఇవి మహిళల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన రంగవల్లికలను ప్రత్యేకాధికారి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వి.రామస్వామి, తహశీల్దార్ ఎం.కాశీప్రసాద్‌తో పాటు మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిరాశ అవసరం లేదు

జెడ్పీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి

ప్రజాశక్తి-భామిని

అర్హులు నిరాశ చెందాల్సిన పని లేదని జెడ్పి చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మిఅన్నారు. బుధవారం మండలంలోని దిమ్మిడిజోల గ్రామంలో జన్మభూమి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్లు వంటి సంక్షేమ పథకాలను అర్హులకు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గ్రామాల్లో యువత, మహిళా సంఘాలు సమస్యలపై దృష్టి సారించామన్నారు. ఇప్పటికే సాధికార మిత్రలను నియమించినట్లు తెలిపారు.వీటి ద్వారా సంక్షేమ పథకాలను పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి గార రమణమ్మ, జడ్‌పిటిసి సభ్యులు ఎస్ గోపాలరావు, స్థానిక టిడిపి నాయకులు జగదీశ్వరరావు పాల్గొన్నారు. కీసరి, వడ్డంగి గ్రామాల్లో జన్మభూమిని నిర్వహించారు. రేషన్‌కార్డులు, పింఛన్లును పంపిణీ చేస్తారని ఆశించి సభకు హాజరైన ప్రజలంతా నిరాశకు గురయ్యారు.



మాట్లాడుతున్న జడ్‌పి చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి

ఏకలవ్య పాఠశాల ప్రారంభం

ప్రజాశక్తి-పాతపట్నం

పాతపట్నం మండలంలోని ప్రహరాజపాలెం వద్ద ఉన్న గిరిజన యువత శిక్షణ కేంద్రంలో ఏకలవ్య పాఠశాల తాత్కాలిక తరగతులను ఎమ్మెల్యే కలమట వెంకటరమణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా మొత్తానికి 60 మంది విదార్థులు ఏకలవ్య పాఠశాలకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్రంలో ఎనిమిది పాఠశాలలు మంజూరయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికి తాత్కాలిక పాఠశాలను మెళియాపుట్టి, భామిని మండలలాకు ఒక్కొక్కటి చొప్పున రెండు పాఠశాలలు మంజూరయ్యాయన్నారు. నూతన భవన నిర్మాణానికి రూ.16 కోట్లు మంజూరయ్యాయన్నారు. అయితే ఇంకా భవనాలు పూర్తికాని కారణంగా గిరిజన యువత శిక్షణ కేంద్రంలో తరగతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. అనంతరం పిఒ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి ఐటిడిఎ నంచి చాలా కృషి జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు ఎమ్.శ్యామసుందరరావు, ఎంపిపి కొల్ల శారద, టిడిపి మండల అధ్యక్షులు పైల.లక్ష్మయ్య, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు పైల.బాబ్జి పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కలమట వెంకటరమణ

నిర్వాసితులపై కక్షసాధింపు చర్యలు

ఎపి రైతు కూలీ సంఘం నాయకులు అరుణ

ప్రజాశక్తి-హిరమండలం/ఎల్ఎన్‌పేట

వంశధార నిర్వాసితులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టిందని ఎపి రైతుకూలీ సంఘం నాయకులు తాండ్ర అరుణ విమర్శించారు. బుధవారం మండలంలో తాయిమాంబపురం, శ్యామలాపురం తదితర పునరావాస కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా పాడలి, తులగాం,గార్లపాడు గ్రామ నిర్వాసితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జలాశయం పనులను వేగవంతం అయ్యేందుకు ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ నిర్వాసితులపై లేదన్నారు. నిర్వాసితుల ఇళ్లను కూల్చి నడిరోడ్డుపై పడేయడంపై ఆమె మండిపడ్డారు. దుప్పట్లు అందించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు.ఇందుకు జిల్లా మంత్రి అధికారులకు సన్మానాలు చేపట్టడం దారుణమన్నారు, నిర్వాసితులు సమస్యలు పరిష్కరించాలని ఆమె కోరారు. ఆమెతో రైతు సంఘం నాయకులు శ్రీనివాసరావు,శంకరావు,నిర్వాసితులు ఉన్నారు.



మాట్లాడుతున్న అరుణ

అతివేగం అనర్థం

హిరమండలం: వాహనాలను అతివేగంతో నడపడంతో అనర్థాలు జరుగుతాయని ఎస్ఐ కె.వెంకటేశ్వరరావు సూచించారు.బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనంపై ఎక్కువగా ప్రయాణికులతో ప్రయాణించరాదనీ ఆయన సూచించారు.దీంతో పాటు అతివేగంగా డ్రైవింగ్ చేయవద్దని ఆయన తెలిపారు. ప్రయాణికులు ఎవరైనా ఫిర్యాదు చేసినట్లయితే సంబంధిత యజమానిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


సేవాభావం తప్పనిసరి


వీరఘట్టం: విద్యతో పాటు ప్రజలకు సేవచేసేలా విద్యార్థులు మెలగాలని తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్ నిమ్మక పాండురంగ అన్నారు. బుధవారం మండలంలోని జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవాశిబిరం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చిన్న నాటి నుంచి చదువుతో పాటుక్రీడల్లో రాణించాలని ఆయన సూచించారు. ఈ వయస్సు నుంచే సేవపై దృష్టిసారిస్తే భవిష్యత్తులో ఉన్నతశిఖరాలను అధిరోహించ వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రౌతు దామోదరరావు, ప్రిన్సిపల్ టి.శంకరరావు, ఎన్ఎస్ఎస్ పిఒ రవికుమార్‌తో , విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా అందజేత

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీలోని కోటగుడ్డి కాలనీకి చెందిన కేవిటి తౌడు ఇటీవల మరణించగా అతని భార్యకు చంద్రన్నబీమా ద్వారా రూ.5000 నగదును టిడిపి మండల అధ్యక్షులు పైల.లక్ష్మయ్య అందజేశారు. ఆయనతో పాటు సీనియర్ టిడిపి నాయకులు సవిరిగాన.ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

రేషన్ సరఫరాలో సాంకేతిక పాట్లు


పడిగాపులుగాస్తున్న లబ్ధిదారులు


ఇ-పోస్ యంత్రం వద్ద వేచి చూస్తున్న డీలర్

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండల కేంద్రం ఎచ్చెర్లలోని రేషన్ దుకాణం-1లో సాంకేతిక సమస్యలతో బియ్యం సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ పోస్ యంత్రానికి పౌరసరఫరాలశాఖ సర్వర్ సిగ్నల్ అందకపోవడంతో సాఫ్ట్‌వేర్ పనిచేయడం లేదు. రోజు మొత్తం చేసిన 10 నుంచి 20 కార్డులకు మాత్రమే బియ్యం సరఫరా చేస్తున్నారు.

గత రోజులుగా ఇదే సమస్య ఎదురుకావడం రేషన్ కార్డుదారులతో పాటు, డీలర్ కూడా దుకాణంలోనే పడిగాపులు కాస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించి, తమ ఇక్కట్లను తొలగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సర్వర్ సిగ్నల్ అందటం లేదు

ఇ-పాస్ యంత్రానికి సర్వర్ సిగ్నల్ అందటం లేదు. దీనివల్ల లబ్ధిదారులు వేలిముద్రలు తీసుకోవటానికి వీలు కుదరటం లేదు. బియ్యం సరఫరా చేయలేకపోతున్నాం.

– పి.మహేష్, డీలర్, ఎచ్చెర్ల


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కంచరాం హైస్కూల్లో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- రాజాం

మండల పరిధిలోని కంచరాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ సముదాయంలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. 3,4,5 తరగతుల విద్యార్థినులు జూనియర్స్ టీమ్ గాను, 6,7,8 తరగతుల విద్యార్థులకు సీనియర్స్ టీమ్ గాను విభజించి పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో దోసరి హైస్కూల్ టీమ్ ప్రథమ స్థానాన్ని, కంచరాం హైస్కూల్ టీమ్ ద్వితీయ స్థానాన్ని సాధించారు. జూనియర్స్ విభాగంలో కంచరాం ప్రాథమిక పాఠశాల టీమ్ ప్రథమ స్థానాన్ని, రామినాయుడువలస ప్రాథమిక పాఠశాల టీమ్ ద్వితీయ స్థానాన్ని సాధించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సముదాయ చైర్మన్ ఎం.సాయిశ్వరి, స్కూల్ కాంప్లెక్స్ సహాయ కార్యదర్శి పిల్లా తిరుపతిరావు పాల్గొన్నారు.


వినతి పత్రం అందిస్తున్న రామినాయుడు

'రబీ'కి నీరందించాలని ధర్నా

ప్రజాశక్తి- రాజాం

రబీ సీజన్‌లో రైతులు పండిస్తున్న మొక్కజొన్న పంటకు తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు అందించాలని ఏపి రైతు సంఘం డివిజన్ కార్యదర్శి పాలవలస రామినాయుడు అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అమ్మవారికాలనీ దరిలోని తోటపల్లి ప్రాజెక్టు కార్యాలయం ముందు రైతులతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటపల్లి నీరు సకాలంలో అందిస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో సుమారు మూడు వేల ఎకరాల్లో రైతులు మొక్క జొన్న పండిస్తున్నారన్నారు. అయితే ఇంతవరకూ నీరు అందక పంట ఎండిపోయే దశకు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి తోటపల్లి నీరు విడుదల చేయాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం గౌరవ అధ్యక్షులు రెడ్డి అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు పాల్గొన్నారు.

'మర చెంబుకు శవయాత్ర'

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మరుగుదొడ్ల నిర్మాణం కోరుతూ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి విద్యార్థులు బుధవారం ఎచ్చెర్లలో వినూత్న ప్రదర్శన చేపట్టారు. బహిరంగ మలవిసర్జనకు వినియోగించే మర చెంబుకు శవయాత్ర చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఈ అనాగరిక పద్ధతిని మానుకోవాలని, అందరూ మరుగుదొడ్లను వినియోగించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల పౌర సంబంధాలు అధికారులు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు సతీష్‌కుమార్, రొట్ట గణిపతిరావు, రాంభట్ల పార్వతీశ్వరశర్మ పాల్గొన్నారు.


మర చెంబుకు శవయాత్ర చేస్తున్న విద్యార్థులు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌కుమార్

7న రాజాంలో 5కె రన్

రాజాం: రాజాం మండల స్థాయిలో ఈ నెల 7వ తేదీన 5కె రన్ నిర్వహించనున్నామని జిల్లా స్పోర్ట్స్ అధికారి శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కంచరాం దరి తృప్తి రీసార్ట్స్‌లో విలేకరులతో మాట్లాడారు. జన్మభూమి-మీ ఊరులో భాగంగా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర యువజన సర్వీసుల విభాగం ఆదేశాలు మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకూ ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులతో పాటు యువజన సంఘాల సభ్యులు, ఎన్‌జిఒలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, నెహ్రూ యువకేంద్ర వలంటీర్లు, మహిళా సంఘ సభ్యులు విధిగా పాల్గోవాలని పిలుపునిచ్చారు. పాల్గోవాలనుకున్నవారు 6వ తేదీ మధ్యాహ్నం లోగా తమ పేర్లను తహశీల్దార్, ఎంపిడిఒ, నగర పంచాయతీ కమిషనర్ల కార్యాలయాల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సిఇఒ బి.వి.ప్రసాదరావు, మండల ప్రత్యేకాధికారి, ఆర్.వెంకట్రామన్, కమిషనర్ జి.సురేష్, ఎంపిడిఒ బి.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ వై.శ్రీనివాసరావు, కొత్తా సాయిప్రసాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, తృప్తి రీసార్ట్స్ ఎండీ మురళీ మాస్టారు, జిఎంఆర్ఐటి పీడీ అరుణ్‌కుమార్, పొగిరి ప్రభుత్వ పాఠశాల పీడీ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.


విద్యార్థికి బంగారు పతకాన్ని అందిస్తున్న ముఖలింగం

విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని ఫరీదుపేట ఉన్నత పాఠశాలలో 2016-17 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో మెరిట్ సాధించిన మెట్ట శ్యామలరావుకు బంగారు పతకాన్ని బుధవారం అందించారు. శ్యామలరావు ట్రిపుల్ ఐటిలో పియుసి చదువుతున్నారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి, టిడిపి నాయకులు పైడి ముఖలింగం దీనిని బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జయదేవి మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు కొన్నేళ్లుగా బంగారు పతకాన్ని ముఖలింగం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి కొత్తకోట అమ్మినాయుడు పాల్గొన్నారు.


జి.సిగడాం... మాట్లాడుతున్న మంత్రి కళావెంకటరావు

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

విద్యుత్ శాఖ మంత్రి కళావెంకటరావు

ప్రజాశక్తి- జి.సిగడాం

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని విద్యుత్‌శాఖ మంత్రి కిమిడి కళావెంకటరావు అన్నారు. బుధవారం మండలంలోని దుగ్గివలసలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉదయం నిర్వహించిన సభలో పింఛన్లు, రేషన్ కార్డుల పంపిణీ, మధ్యాహ్నం సభలో రోజుకొక ప్రాధాన్యతా అంశంపై అవగాహన కల్పిస్తామన్నారు. రైతులకు మడ్డువలస నుంచి నీటిని అందిస్తామని, అంతర పంటలు వేసుకొని సద్వినియోగపర్చుకోవాలని అన్నారు. ప్రతి గ్రామానికీ విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, జన్మభూమి ప్రత్యేకాధికారి బాలకృష్ణ, జిల్లా ప్రాదేశిక సభ్యురాలు లోళ్ల, ఎంపిపి సూరీడమ్మ, ఎంపిటిసి రమాదేవి, సర్పంచ్ జగన్మోహిని, డిఎంఅండ్‌హెచ్ డాక్టర్ మెండ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని ఎంపిపి బల్లాడ వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని బుడగట్లపాలెం, కుప్పిలిలో బుధవారం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. రేషన్‌కార్డులు, ఉపకార వేతనాలు, చంద్రన్నకానుకలను అందించారు. బుడగట్లపాలెంలో ప్రాథమికోన్నత పాఠశాలలో ఉత్తమ సేవలందించిన ప్రధానోపాధ్యాయులు కూర్మారావుకు సన్మానం చేశారు. కార్యక్రమంలో బుడగట్లపాలెం సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, కుప్పిలి సర్పంచ్ భర్త అలుపన నాగిరెడ్డి, మండల ప్రత్యేకాధికారి జమదగ్ని, అధికారులు పాల్గొన్నారు.


ఎచ్చెర్ల... ఉపకార వేతనాల మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎంపిపి బి.వి.రమణారెడ్డి

'సమస్యల పరిష్కారానికే 'జన్మభూమి'

రణస్థలం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక జన్మభూమి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎంపిపి గొర్లె విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని దేరసాం, వల్లభరావుపేట, కోష్ట, పిషిణి గ్రామాల్లో జన్మభూమిని నిర్వహించారు. ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పంపిన ఏడు పేజీల లేఖను చదివి వినిపించారు. అనంతరం చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కె.ధర్మారావు, తహశీల్దార్ కె.శ్రీరాములు, వైస్ ఎంపిపి దుమ్ము అశోక్, నాయకులు డిజిఎం ఆనందరావు, ఎంపిడిఒ యు.కుమార్‌పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.


రణస్థలం... మాట్లాడుతున్న ఎంపిపి గొర్లె విజయ్‌కుమార్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

రాజాం : మండలంలోని బుధవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డోలపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, గడిముడిదాం, పెనుబాక యుపి పాఠశాలల్లో ఈ వేడుకలు చేపట్టారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించుకున్న మహిళా దినోత్సవ వేడుకల్లో విద్యార్థినులకు, మహిళా ఉపాధ్యాయులు నడుమ పోటీలు నిర్వహించి విజేతలకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బహుమతులు అందజేశారు. డోలపేట హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు వి.వి.వసంతకుమార్, వల్లూరు దాలినాయుడు, త్రిమూర్తులు, యు.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల నుంచి పంచదార, కందిపప్పు

రేషన్ దుకాణాల్లో లభ్యం
మరుగుదొడ్ల నిర్మాణంలో వెనుకబడ్డాం
జన్మభూమిలో మంత్రి కె.అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-టెక్కలి

జనవరి నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా చౌక ధరల దుకాణాల ద్వారా పంచదార, సబ్సిడీపై కందిపప్పును సరఫరా చేయనున్నట్లు రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా బుధవారం రావివలస గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో మంత్రి పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కిరోసిన్ సరఫరాను నిలిపివేసిందన్నారు. అయితే ఈ నెల నుంచి రేషన్‌లో ఇక నుంచి ప్రతి నెలా బియ్యంతో పాటు, పంచదార, కందిపప్పు అందించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అలాగే చంద్రన్న పెళ్లి కానుక పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ పథకంలో భాగంగా తెలుపు రేషన్‌కార్డుదారులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. మైనార్టీ ఆడపిల్లలకు పెళ్లి ఖర్చుల నిమిత్తం రూ.50 వేలు, ఎస్టీ, ఎస్సీ ఆడపిల్లకు రూ.40 వేలు, బిసి ఆడపిల్లలకు రూ.35 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. అలాగే మార్చి నెలాఖరు నాటికి వంశధార పనులు పూర్తి చేసి రైతాంగానికి రెండు పంటలకు సాగునీరు అందివ్వనున్నట్లు తెలిపారు. రూ.90 కోట్లతో వంశధార, నాగావళి నదుల అనుసంధానికి ప్రణాళిక తయారుచేస్తున్నట్లు తెలిపారు. రూ.470 కోట్ల వ్యయంతో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. వడ్డితాండ్ర నుంచి రావివలస జంక్షన్ వరకు రోడ్డు, రావివలసలో బస్‌షెల్టర్ నిర్మాణానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. సర్పంచ్ బడే జగదీష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కొత్తగా మంజూరైన పింఛన్లను, చంద్రన్న ఉపకార వేతనాలను, చంద్రన్నబీమా బాండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు శివరామప్రసాద్, ఎం.వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖాధికారి రవి ప్రకాష్, వంశధార ఇఇ శేఖర్‌బాబు, తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, టెక్కలి,సంతబొమ్మాళి జడ్పిటిసిలు కర్ణిక సుప్రియ, లమ్మత లక్ష్మి, ఎంపిపి మట్ట సుందరమ్మ, సర్పంచ్‌లు బడే జగదీష్, బెహరా కృష్ణవేణి, టిడిపి అధ్యక్షులు బగాది శేషగిరి, మండల ఉపాధ్యక్షులు హనుమంతు రామకృష్ణ, టిడిపి నాయకులు నర్తు కృష్ణారావు, చాపర గణపతి, బెహరా కాళీ, మట్ట పురుషోత్తం, మామిడి రాము, దల్లి ప్రసాద్‌రెడ్డి, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని నారాయణవలస పంచాయతీ చిన్నతుంభయ్యపేటలో నిర్వహించిన జన్మభూమి - మన ఊరు కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మంత్రి పాల్గొని మాట్లాడారు. గర్భిణులకు ఆస్పత్రిలో ప్రసవాలు జరిగితే రూ. ఆరు వేలు మంజూరు చేస్తున్నామన్నారు. 50 సంవత్సరాల లోపు వారు సాధారణంగా మృతి చెందితే రూ.రెండు లక్షలు, ప్రమాద వశాత్తు మరణిస్తే రూ.ఐదు లక్షలు వంటి చంద్రన్న బీమా సౌకర్యాలు అదిస్తున్నామన్నారు. ఉగాది నుంచి చంద్రన్న పెళ్ళి కానుకలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే కులవృత్తులవారికి, నిరుద్యోగులకు పలు కార్పోరేషన్‌ల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామని, విదేశాల్లో చదువుకునేందుకు విద్యార్థులకు ఆర్థిక సహాయం వంటి పథకాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. హిజ్రాలకు రూ. 1500లు పింఛను ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా మరుగుదొడ్ల నిర్మాణంలో వెనుకబడి ఉందనీ, మార్చి 31వ తేదీలోగా శాత శాతం మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలనీ, అందుకు సర్పంచ్‌లు తన వంతు సహకరించాలని కోరారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తర్ర రామకృష్ణ, ఎఎంసి చైర్మన్ వెలమల విజయలక్ష్మి, సర్పంచ్ పల్లి కళావతి, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, టిడిపి నాయకులు కర్రి అప్పారావు, బోయిన గోవిందరాజులు, ఎంపిడిఒ ఎం.రేణుక, మండల ప్రత్యేకాధికారి కె.శ్రీదేవి, సిఎస్‌డిటి బైరి. రాజు, ఉపాధిహమీ ఏపీఓ జి. హరిప్రసాద్, విద్యుత్‌శాఖ ఏఈ ఎం. చంద్రశేఖరరావు, ఎంపీఓ టి. నారాయణరావు, తదితర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గోపాల మిత్ర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


టెక్కలిలో సంక్రాంతి సరుకులు పంపిణీ చేస్తున్న మంత్రి


మాట్లాడుతున్న వైసిపి నాయకులు

తొలగించడమేనా సంక్షేమం?

ప్రజాశక్తి-పోలాకి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రచారం చేస్తూ పేదల ఇండ్లకు విద్యుత్ సౌకర్యాన్ని తొలగించడమేనా సంక్షేమం అని వైసిపి మండల నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం మండలంలోని రాళ్లపాడు గ్రామంలో 16 ఇళ్లకు మరుగుదొడ్లు నిర్మించలేదనే నెపంతో విద్యుత్ కనెక్షన్లను దగ్గరుండి మరీ అధికారులు కట్ చేయించారనీ గ్రామస్తులతో కలిసి వైసిపి నాయకులు కరిమి రాజేశ్వరరావు, ముద్దాడ బైరాగినాయుడు, ఆర్ అప్పలరాజు, కణితి కృష్ణారావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రాళ్లపాడులో విద్యుత్ కనెక్షన్లు తొలగించిన 16 ఇళ్లకు 24 గంటల్లోగా విద్యుత్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార నాయకులు

ఎస్టీ జాబితాలో చేర్చాలి

సంతబొమ్మాళి: మండలంలో మేఘవరంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్పించాలని కోరుతూ తహశీల్దార్ రామారావుకు మత్సకార నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాగర మత్స్యకార కార్మిక సంఘం అధ్యక్షులు సూరాడ రాజారావు మాట్లాడుతూ టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో మత్స్యకారులను ఎస్‌టి జాబతాలో చేర్చుతామని, 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకు పింఛన్ అందిస్తామని, మత్స్యకారులకు ఎమ్మెల్సీ సీటు కేటాయిస్తామని హామీ ఇచ్చిందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినప్పటికీ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్పించాలని కోరారు.

సిపిఎస్ రద్దు చేయరూ..

సంతబొమ్మాళి: సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కంట్రీబ్యూటరీ పెన్షన్ సంఘ నాయకులు బుధవారం జన్మభూమి కార్యక్రమంలో అదికారులకు వినతిపత్రం అందజేశారు. 2004 సెప్టెంబర్ 1 తరువాత నియామకం పొందిన 1.84 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబా లకు పదవీ విరమణ అనంతరం ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరారు. వినతి అందజేసినవారిలో సంఘ నాయకులు రాజు, దుర్గారావు, నారాయణరావు తదితరులు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సిపిఎస్ ఉద్యోగులు

ఏడాదైనా జమకాని 'పసుపు కుంకుమ'

జన్మభూమిలో డ్వాక్రా సంఘాల నిలదీత

ప్రజాశక్తి-సారవకోట

రుణమాఫీ కింద గతేడాది ప్రకటించిన పసుపు కుంకుమ కానుకలను నేటికీ అందజేయలేదని మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన డ్వాక్రా సభ్యులు అధికారులకు నిలదీశారు. సర్పంచ్ పొదిలాపు కృష్ణారావు ఆధ్వర్యంలో బుధవారం జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మ డ్వాక్రా గ్రూపునకు చెందిన సుబ్బలక్ష్మీ, సత్యన్నారాయణ గ్రూపునకు చెందిన వసంత, అంబేద్కర్ గ్రూపునకు చెందిన కోనాడ శిమ్మమ్మ గ్రూపులకు చెందిన సభ్యులకు ఇంతవరకు పసుపు కుంకుమ ద్వారా రుణమాఫీ డబ్బులు అందలేదని సర్పంచ్‌తో పాటు పలువురు అధికారులను ప్రశ్నించారు. అలాగే సాధికార మిత్రలను ఎవ్వరికీ చెప్పకుండా ఎంపిక చేసినట్లు పలువురు అధికారులను ప్రశ్నించారు. బైదిలాపురం, లక్ష్మీపురం గ్రామంలో ఎంపిడిఒ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జన్మభూమిని నిర్వహించారు. మాళువ, నౌతళలో తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో గ్రామసభలను నిర్వహించారు.
కార్యక్రమంలో అధికారులు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు

ఎన్ఎంయు కార్మికుల రిలే దీక్ష

ప్రజాశక్తి- టెక్కలి

స్థానిక ఆర్టీసి డిపో ఎదుట ఎన్ఎంయు నాయకులు ఆధ్వర్యంలో బుధవారం రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎంయు డిపో కార్యదర్శి కణితి దశరధుడు, బసవల ధనుంజయ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రిలేదీక్షలు చేపట్టారు. ఒటి పని గంటలను తగ్గించి చట్ట ప్రకారం ఎనిమిది గంటల పాటు విధులు నిర్వర్తించేలా జీవో తీసుకురావాలనీ, అన్ని డిపోల్లో కొత్త టిమ్ మిషన్లు అందించాలనీ, ప్రతి కార్మికునికీ నెలకు మూడు రోజులు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ ఎస్ రమణ, లచ్చన్న, గురునాధరావు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో అన్నప్రాశం

ప్రజాశక్తి-సారవకోట

మండలంలోని లక్ష్మీపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు డిపిఒ కోటేశ్వరరావు, సర్పంచ్ పొదిలాపు కృష్ణారావు ఆధ్వర్యంలో బుధవారం అన్నప్రాశం నిర్వహించారు. అనంతరం డిపిఒ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వీటిని పిల్లలకు అందించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-టెక్కలి

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ట్రాన్స్‌కో డిఇఇ కార్యాలయం ఎదుట విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్షులు ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్‌లు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. మీటర్ రీడర్స్‌ను శాఖ పరిధిలోకి తీసుకోవాలని కోరారు. అనంతరం కార్యాయలం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.


కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

కోటబొమ్మాళి: జన్మభూమి గ్రామ సభల్లో భాగంగా మండలంలోని నారాయణవలసలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక ఎంపిపి తర్ర రామకృష్ణ, ఎఎంసి చైర్మన్ వెలమల విజయలక్ష్మి శిబిరాన్ని ప్రారంభించారు. పశువులకు పశుసంవర్ధకశాఖాధికారి ఎ.రామ్‌కుమార్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అలాగే పశువుల్లో చూడీ, కృత్రిమ గర్భధారణ, సాధారణ వ్యాధులపై పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే పశువుల్లో గొంతువాపు, సీజనల్‌గా వచ్చే వ్యాధులపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన జన్మభూమి - మన ఊరు కార్యక్రమంలో పాలొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం. రేణుక, మండల ప్రత్యేకాధికారి కె. శ్రీదేవి, సిఎస్‌డిటి బైరి. రాజు, ఉపాధిహమీ ఎపిఒ జి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

విద్యతోనే స్త్రీ విముక్తి


మందస: సావిత్రిభాయి చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న జయలక్ష్మి

ప్రజాశక్తి-మందస

విద్య ద్వారానే స్త్రీలకు విముక్తి సాధ్యమవుతుందని ఎంపిపి దాసరి జయలక్ష్మి అన్నారు. హరిపురంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బుధవారం యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యాన జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పూలే నూతన సమాజ స్థాపనకు కృషి చేశారన్నారు. ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు విద్యావంతులైతే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుంట కోదండరావు, హెచ్ఎం తారకేశ్వరరావు, కె.మాధవరావు, అధ్యక్ష, కార్యదర్శులు జయరాం మాలి, డి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పలాస: పట్టణంలోని సాయికాలనీలో ఎంపియుపి పాఠశాలలో యుటిఎఫ్ మహిళా విభాగం కన్వీనర్ జి.సత్యవతి అధ్యక్షతన పూలే జయంతి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినిగా సావిత్రిభాయి పూలే సేవలు ఆదర్శమన్నారు. ముందుగా ఉపాధ్యాయినిగా పని చేసిన జె.కామేశ్వరమ్మను సన్మానించారు. కార్యక్రమంలో బెండి లక్ష్మి, ఎం.జయప్రద, జి.పద్మ, ఎల్.వి.చలం, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే మార్గ నిర్దేశకులు

ఇచ్ఛాపురం: ఉపాధ్యాయులే మార్గ నిర్దేశకులని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. అంతర్జాతీయ మహిళా టీచర్స్ డే సందర్భంగా బుధవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో సావిత్రిభాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రగతి బాటలో రాణించడంలో ఉపాధ్యాయులు ప్రముఖ పాత్ర వహిస్తారన్నారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం మణిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, పాఠశాల హెచ్ఎం పద్మవల్లి, యుటిఎఫ్ అధ్యక్షులు సూర్యనారాయణ, ధనుంజయరావు, మల్లేష్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: స్థానిక కృష్ణసాయి విద్యాసంస్థల్లో బుధవారం సావిత్రిభాయి పూలే జయంతి నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి కళాశాల సిబ్బంది బి.ప్రకాశరావు పూలమాలలేసి, నివాళ్లర్పించారు. అనంతరం కళాశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా అధ్యాపకులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపియుపి స్కూల్లో సావిత్రిభాయి పూలే జయంతిని యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శి ఎన్.రవి నిర్వహించారు. సంఘ సంస్కర్తగా ఆమె చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సభ్యులు భగవతిరావు, పురుషోత్తం రెడ్డి, నారాయణరెడ్డి, కె.ఆనంద్, జె.లిమ్మా, లావణ్య దొళాయి పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం:కార్యక్రమంలో మాట్లాడుతున్న మణి

పలాస రూరల్: బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బుధవారం సావిత్రిభాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా సావిత్రిభాయి చిత్రపటానికి పూలమాలలేసి, నివాళ్లర్పించారు. ఆమె జీవిత చరిత్రను వీడియో రూపంలో విద్యార్థులకు వివరించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులు సువర్ణకుమారి, పద్మ, వాసంతి, యామినిలను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం పాణి శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: పి.జె.పురం ప్రాథమికోన్నత పాఠశాలలో పూలే 187వ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ధనుంజయరావు, తులసీరావు, వీరాస్వామి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కవిటి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సావిత్రిభాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు టి.రాధిక, వై.రాధ, టి.సుమలత, జె.జానకమ్మ, కె.విజయలక్ష్మి, డి.శిరీషాదేవి, పి.లక్ష్మి, సిహెచ్.కల్పనలను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని బెంకిలి ప్రాథమిక పాఠశాలలో బుధవారం జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులు ఉమాదేవి పాణిగ్రాహి, ఎన్.లీలారాణిలను సన్మానించారు. కార్యక్రమానికి సర్పంచ్ ఎం.చామంతి అధ్యక్షత వహించగా, ఉపాధ్యాయులు బాబూరావు, వై.జోగారావు, నగిరి మోహనరావు పాల్గొన్నారు.

చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ

కవిటి: మండలంలోని కొత్తపాలెం, గొండ్యాలపుట్టుగ గ్రామాల్లో బుధవారం చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దశరథరావు, శేఖర్, ఎంపిటిసిలు రమణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పనులతో ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

పూండిలోని రైల్వేగేటు వద్ద జరుగుతున్న రహదారి పనులతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ముందస్తు సమాచారం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పూండి రైల్వేగేటు వద్ద రహదారి అధ్వానంగా మారడంతో అప్, డౌన్ లైన్లు వద్ద యుద్ధప్రాతిపదికన రహదారి పనులు నిర్వహిస్తున్నామని పూండి ఆర్ఎస్ ఎస్‌విడబ్ల్యు ఎల్.కె.మిశ్రా తెలిపారు. రహదారి పనులతో ట్రాఫిక్‌కు కొంతమేరకు అంతరాయం ఏర్పడిందన్నారు.


రోడ్డు పనులు చేస్తున్న కార్మికులు

అభివృద్ధి ఎక్కడో చూపండి

అధికారులను నిలదీసిన ప్రజలు


వజ్రపుకొత్తూరు: అధికారులను నిలదీస్తున్న ప్రజలు

ప్రజాశక్తి-వజ్రపుకొత్తూరు

మండలంలోని మెట్టూరు, గుణుపల్లి, అక్కుపల్లి, ఎం.గడూరు గ్రామాల్లో బుధవారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. గుణుపల్లి, మెట్టూరు గ్రామాభివృద్ధి సంఘాల అధ్యక్షులు వాసుపల్లి గణపతి, వైసిపి నాయకులు భీమారావు మాట్లాడుతూ అర్హులకు పింఛన్లు, రేషన్ కార్డులు అందడంలేదని, గ్రామాల్లో ఎక్కడ అభివృద్ధి జరిగిందో చూపించాలని ప్రశ్నించారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని నిలదీశారు. దీంతో సహనం కోల్పోయిన వైస్ ఎంపిపి దాసరి జేజేరావు ప్రజలపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో జన్మభూమి కార్యక్రమం రసాభాసగా మారింది. సమస్యలను పరిష్కరించలేని సభ్యులెందుకని ప్రజలు వెనుదిరిగారు. కార్యక్రమంలో ఎంపిపి వసంతరావు, మండల ప్రత్యేకాధికారి సూర్యనారాయణ, తహశీల్దార్ రమణయ్య, ఎంపిడిఒ వి.తిరుమలరావు, సర్పంచ్‌లు తరిణిభాయి, ఎల్.భారతి, కాస హైమావతి పాల్గొన్నారు.

కిరోసిన్, పంచదార పంపిణీ చేయాలి

పలాస: రేషన్ డిపోల ద్వారా కిరోసిన్, పంచదార పంపిణీ చేయాలని పెసరపాడు గ్రామస్తులు ఎమ్మెల్యే శివాజీని కోరారు. బుధవారం పెసరపాడు గ్రామంలో జన్మభూమి-మా ఊరు నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ కేంద్ర పంపిణీ చేయడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి వాటిని పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. మాజీ కౌన్సిలర్ ఎస్.ధనుంజయ మాట్లాడుతూ, ఎమ్మెల్యేలు మారుతున్నా గ్రామంలో తాగునీటి సమస్య, శ్మశాన వాటిక సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ శాసనసభ సభ్యులు కూడా మారిపోతారా అంటూ అసహనం వ్యక్తం చేశారు. చినబాడాంలో గ్రామసభ జరిగింది. లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు, పింఛన్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో కౌన్సిలర్లు కె.అరుణకుమారి, ఎల్.కామేశ్వరరావు, కె.సురేష్‌కుమార్, వైస్ ఛైర్మన్ జి.సూర్యనారాయణ, జి.కృష్ణారావు, బి.నాగరాజు, పి.మల్లేషు, తదితరులు పాల్గొన్నారు.

పలాసరూరల్: మండలంలోని అమలకుడియా, బంటుకొత్తూరు పంచాయతీల్లో బుధవారం జన్మభూమి-మాఊరు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పి.విఠల్‌రావు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సభలో పలాస మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రమణ్యం, తహశీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, ఎంపిడిఒ పి.సూర్యనారాయణ, ఎఒ నాగరాజు, వెలుగు ఎపిఎం జాంబవతి, ఎపిఒ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని 4, 5 వార్డుల్లో బుధవారం జన్మభూమి గ్రామసభలు మొక్కుబడిగా సాగాయి. సిఎం పర్యటన దృష్ట్యా వివిధ శాఖల అధికారులు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో జన్మభూమి-మాఊరు తూతూ మంత్రంగా సాగింది. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, కౌన్సిలర్ రవి బెహరా, గేదెల శేఖర్, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మందస: మండలంలోని సిరిపురం, పొంత్తగి, బెల్లుపటియా, హోన్నాళి గ్రామాల్లో బుధవారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ప్రజలు, అధికారులతో జన్మభూమి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎస్.సూర్యనారాయణ, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, తహశీల్దార్ ఎస్.వి.శ్యామసుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం, బొగాబెణి, అంపురం, కొజ్జిరియా గ్రామాల్లో బుధవారం ఎంపిడిఒ చల్లా శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో జన్మభూమి-మా ఊరు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సత్యారావు, ఎంపిడిఒ చల్లా శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని మామిడిపల్లి, శాసనాం, కొర్లాం పంచాయతీల్లో బుధవారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి చిత్రాడ శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి సూరాడ చంద్రమోహన్, ఎంపిటిసి ఆర్.వెంకటరమణ, సర్పంచ్‌లు పి.శేషగిరి, తెంబూరు రూప, ఎస్.సావిత్రి, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని రాజపురం, బైరిపురం, డి.జి.పుట్టుగ గ్రామాల్లో బుధవారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు.కార్యక్రమంలో జెడ్‌పిటిసి బి.రమేష్, ఎంపిపి బి.కుమారి, ఎంపిడిఒ రామకృష్ణారావు, తహశీల్దార్ ఉమామహేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.


దివ్యదర్శనం బస్సును ప్రారంభిస్తున్న అశోక్

దివ్యదర్శనం బస్సు ప్రారంభం

కవిటి: దివ్యదర్శనం బస్సును ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అన్ని సౌకర్యాలూ కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దివ్యదర్శనాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బి.రమేష్, సర్పంచ్ పి.శేఖర్, ఎంపిడిఒ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

745 జీవాలకు టీకాలు

ప్రజాశక్తి-పలాస రూరల్

745 జీవాలకు టీకాలు వేసినట్లు పలాస పశు సంవర్ధక శాఖాధికారి పి.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని బంటుకొత్తూరు, అమలకుడియా గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. 404 పశువులకు టీకాలు, 12 పశువులకు గర్భకోశ చికిత్స, ఐదు పశువులకు కృత్రిమ గర్భకోశ చికిత్సలకు, 71 దూడలకు ఏలికపాము నివారణా మందులు వేశామన్నారు. కార్యక్రమంలో గోపాలమిత్ర దువ్వాడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - కంచిలి

మండల కేంద్రంలోని కరుణామయి చర్చి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా దుప్పట్లు, చీరలను ఎంపిపి ఇప్పిలి లోలాక్షి నిరుపేదలకు పంపిణీ చేశారు. అనంతరం ఎంపిపి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో పాస్టర్ రమేష్, గ్రామ పెద్దలు జి.రాందాసు, డి. ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.


'సమర్థవంతంగా 'జన్మభూమి' నిర్వహించాలి'

ప్రజాశక్తి-కవిటి

జన్మభూమి-మాఊరు గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలి మండల ప్రత్యేకాధికారి నర్సింగరావు అధికారులకు సూచించారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జన్మభూమికి వచ్చే సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ రామకృష్ణారావు, తహశీల్దార్ ఉమామహేశ్వరరావు, ఇఒపిఆర్‌డి సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన

ఇచ్ఛాపురం: మండలంలోని మండపల్లి, బిర్లంగి, హరిపురం, కొళిగాం గ్రామాల్లో బుధవారం ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన విద్యార్థులు మరుగుదొడ్ల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మధుసూదన్, అధ్యాపక బృందం నిత్యానంద పట్నాయిక్, గణపతిరావు, కృష్ణారావు, శంకరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నమ్మకద్రోహనికి బాబు బ్రాండ్ అంబాసిడర్

వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నమ్మకద్రోహనికి, వెన్నుపోటు రాజకీయాలకు చంద్రబాబునాయుడు బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి విరుచుకుపడ్డారు. పాతపట్నంలోని ఒక ప్రయివేటు కార్యక్రమానికి బుధవారం హాజరైన ఆమె, శ్రీకాకుళంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబుకు వయసు మీరుతున్నా అలోచనల్లో మార్పు, తీరు మారలేదని విమర్శించారు. బాబు పాలనలో మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, రైతులు తీవ్రంగా మోసపోయారని విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబు పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. చంద్రబాబు పాలనతో ప్రజలు విసిగి పోయారన్నారు. అధికారం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి, సిఎం పదవి చేజిక్కించుకున్న తర్వాత ప్రజలకు ముఖం చూపించలేక ఎదురుదాడికి దిగుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుతున్నందునే జగన్ చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. జన్మభూమి కార్యక్రమం ద్వారా ప్రజలకు ఒరిగింది శూన్యమని విమర్శించారు.

మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా కాకుండా టిడిపి నాయకుడిగానే మాట్లాడుతున్నారని విమర్శించారు. వైసిపి రాష్ట్ర ప్రధాన రెడ్డి శాంతి మాట్లాడుతూ నాలుగేళ్లలో తొమ్మిది సార్లు వచ్చిన చంద్రబాబు జిల్లాకు చేసిందేమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. వంశధార నిర్వాసితులను రోడ్లపైకి నెట్టి, వారికి అన్యాయం చేశారని విమర్శించారు. తొలిసారిగా జిల్లా నూతన కార్యాలయానికి వచ్చిన లక్ష్మీపార్వతిని ఆ పార్టీ నాయకులు ధర్మాన ప్రసాదరావు, రెడ్డి శాంతి, కృష్ణదాస్ దుశ్శాలువతో సత్కరించారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు మామిడి శ్రీకాంత్, టి.కామేశ్వరి తదితరులు ఉన్నారు.


లక్ష్మీపార్వతిని సత్కరిస్తున్న వైసిపి నాయకులు


గవర్నర్‌కు బొకే అందిస్తున్న విసి రామ్‌జీ

గవర్నర్‌ను కలిసిన విసి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్ నరసింహన్‌ను డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ కూన రామ్‌జీ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. వర్సిటీకి గవర్నర్ ఛాన్సలర్ కూడా కావడంతో వర్సిటీ పరిపాలన, సమస్యలు, అవసరాలు గురించి ఆయనకు వివరించారు. వర్సిటీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా గవర్నర్ హామీ ఇచ్చారు.

7న ఓపెన్ చదరంగం పోటీలు

ప్రజాశక్తి - టెక్కలి

ఈ నెల 7వ తేదీన చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చదరంగం పోటీలు టెక్కలిలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సనపల భీమారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల క్రీడాకారులు పాల్గొనున్నట్లు తెలిపారు. విజేతలకు రూ.ఐదు వేలు ప్రోత్సాహక బహుమతితో పాటు ధ్రువపత్రం, షీల్డ్ అందజేయనున్నట్లు తెలిపారు. ఓపెన్ విభాగంలో పది బహుమతులతో పాటు అండర్-13 విభాగంలో రెండు, అండర్ 11 విభాగంలో రెండు, అండర్-9 విభాగంలో రెండు బహుమతులు చొప్పున కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 6వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఫోన్ 9912559735 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉద్దాన సమస్యలపై
ఎమ్మెల్యే అశోక్‌కు వినతి

ప్రజాశక్తి - కవిటి

ఉద్దానంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్‌కు ఉద్దానం అభివృద్ధి వేదిక ప్రతినిధులు బుధవారం వినతిపత్రం అందజేశారు. కిడ్నీ వ్యాధి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేయాలన్నారు. జీడి, కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఆయన నివాసంలో కలిసి, కోరారు. మత్స్యకారులకు ప్రభుత్వం తరుపున వలలు, డీజిల్ సబ్సిడీపై అందించాలన్నారు. వేట సమయంలో ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబాలకు రూ.పది లక్షలు ఎక్స్‌గ్రేసియా అందించాలన్నారు. ఉద్దానం గ్రామాల్లో రహదారి సౌకర్యం కల్పించడంతోపాటు ఆర్‌టిసి బస్టాండ్ ఏర్పాటు చేయాలన్నారు. కిడ్నీ బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో యుడిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రామారావు, గాంధీవర్మ, పబ్లిక్ రిలేషన్ ఇన్‌ఛార్జి దేవరాజు, దాసు, వాసు, కోదండరామయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

సిఎం పర్యటనతో ఒరిగేదేమీ ఉండదు

సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్ఛాపురం పర్యటనతో ప్రజలకు ఒరిగిదేమీ ఉండదని లేదని వైసిపి పలాస నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది వజ్రపుకొత్తూరులో నిర్వహించిన జన్మభూమి-మా ఊరులో చంద్రబాబు ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, మినీ జెట్టీలు నిర్మిస్తామని హామీ ఇచ్చి ఏడాది కావస్తున్నా కనీస చర్యలు తీసుకోలేదన్నారు. మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్పించాలని డిమాండ్ చేశారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలని, జిఒ 418ను అమలుచేసి ఉద్దానంలో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మందస మండలంలో కళింగదళ్, డబారిసింగి రిజర్వాయర్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. జంకుజోడు, దామోదరసాగర్‌లను మినీ రిజర్వాయర్లుగా మార్చాలన్నారు. మున్సిపాలిటీలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే ఆఫ్‌షోర్ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో వైసిపి పట్టణ కన్వీనర్ దువ్వాడ శ్రీకాంత్, బి.గిరిబాబు, ఎం.భాస్కరరెడ్డి, గురయ్యానాయుడు, ఎం.కుమారస్వామి, సన్యాసి ఆప్టో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అప్పలరాజు


బారికేడ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్‌పి త్రివిక్రమవర్మ


పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న జెసి చక్రధర్‌బాబు, ఎమ్మెల్యే అశోక్


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్‌పి త్రివిక్రమవర్మ

సిఎం పర్యటనకు భారీ బందోబస్తు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మభూమి-మా ఊరు పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆరుగురు డిఎస్‌పిలు, 14 మంది సిఐలు, 41 మంది ఎస్‌ఐలు, 83 మంది ఎఎస్‌ఐలు, 297 మంది కానిస్టేబుళ్లు, 56 మంది మహిళా కానిస్టేబుళ్లు, 129 మంది హోంగార్డులు బందోబస్తులో భాగంగా ఇచ్ఛాపురం చేరుకున్నాయి. వీరితో పాటు ఎఆర్, రోప్ పార్టీల బృందాలు చేరుకున్నాయి. ఇప్పటికే సిఎం చేరుకునే హెలీప్యాడ్, సభా వేదికతో పాటు పరిసర ప్రాంతాలు పోలీసుల స్వాధీనం చేసుకున్నారు. ఇచ్ఛాపురంలో ఎక్కడ చూసినా పోలీసు బలగాలే కనిపిస్తున్నాయి.

అప్రమత్తంగా ఉండాలి

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి త్రివిక్రమవర్మ అన్నారు. సిఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్లపై బుధవారం అధికారులతో సమీక్షించి, పలు సూచనలు చేశారు. మూడు గంటల పాటు సిఎం సభా కార్యక్రమం జరుగనుందని, ఎటువంటి ఆటంకాలూ లేకుండా చూడాలన్నారు. ఎస్‌ఐలు మినహా కానిస్టేబుళ్లు, సిబ్బంది సెల్‌ఫోన్లు వినియోగించకుండా విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అనంతరం సభావేదిక, గ్యాలరీలు, స్టాల్స్ ఏర్పాటును పరిశీలించి, పలు సూచనలు చేశారు. హెలీప్యాడ్, సభా ప్రాంగణం, పార్కింగ్ వద్ద బందోబస్తును పరిశీలించారు. ఆయన వెంట ముఖ్యమంత్రి సెక్యూరిటీ అధికారి చిట్టిబాబు, అదనపు ఎస్‌పి పనసారెడ్డి, డిఎస్‌పి రాఘవ పాల్గొన్నారు.

బహిరంగసభకు చురుగ్గా ఏర్పాట్లు

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ పిలుపునిచ్చారు. సిఎం సభా వేదిక, గ్యాలరీ, స్టాల్స్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సిఎం పర్యటన విజయవంతానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. ఈ ప్రాంతంలోని కొబ్బరి రైతులు, మత్స్యకారులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రికి విన్నవిస్తామన్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు కాళ్ల దేవరాజు, తులసీదాసురెడ్డి, బి.నిర్మలారెడ్డి, నందిక జానీ, చాట్ల లోహిదాసురెడ్డి, జగన్నాథరెడ్డి, లీలారాణి, శ్రీనివాస్‌సాహు, ఆంధ్రాబ్యాంకు మాజీ డైరెక్టర్ బెందాళం ప్రకాష్ తదితరులు ఉన్నారు.